# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

23.04.2026 గురువారం Thursday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 267 | పేజీలు : 13 Pages : 13 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789


## దావోస్, గ్లోబల్ సమ్మిట్ పెట్టుబడులపై ఆరా

- ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీలకు భూ కేటాయింపులు
- ప్రముఖ కంపెనీలకు తొలి వెడతలో భూములు
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ సూచన

2





## వాయిదాలో ఓటుకు నోటు కేసు విచారణ

2

రెండు వారాలకు వాయిదా వేసిన సుప్రీం



## కాళేశ్వరంపై సీబీఐ విచారణకు సిద్ధమా?

- నిజాయితీ ఉంటే ముందుకు రండి
- బీఆర్ఎస్ నాయకత్వానికి పొంగులేటి సవాల్

2

## టెర్రరిస్టుపై నోటీసులు

24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ఖర్గేకు ఈసీ ఆదేశం



3

# కాళేశ్వరం కేసులో కేసీఆర్‌కు ఊరట!



- ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై హైకోర్టు కీలక ఆదేశం
- పిటిషనర్లపై చర్యలు తీసుకోవద్దని వెల్లడి
- నివేదిక లీకేజీపై ధర్మాసనం అసహనం
- కమిషన్ ఏర్పాటు చట్టబద్ధమే అన్న కోర్టు
- హరీశ్‌రావు, అధికారులకు సైతం ఊరట

2

## ధర్మమే గెలిచింది

హరీశ్‌రావు

3

## కాళేశ్వరంలో ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

- పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు రాజ్యాంగబద్ధమే
- సీబీఐ విచారణకు హైకోర్టు తీర్పు అడ్డంకి కాదు
- మూడేళ్లకే కుంగిన ప్రాజెక్టు: మంత్రి ఉత్తమ్

వివరాలు 3వ పేజీలో





14

## చదువుల కోవెలలో కామపిశాచులు!

- విద్యార్థినుల ఫిర్యాదుతో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఆకస్మిక తనిఖీ



## డే1

రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సు చక్రం నిలిచిపోయింది. డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ జేఏసీ పిలుపునిచ్చిన సమ్మెతో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచే కార్మికులు విధులను బహిష్కరించారు. డిపోల వద్ద కార్మికులు నిరసనలకు దిగడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బస్సులు రోడ్డెక్కకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తుండడంతో ఆటోలు, క్యాబ్‌లకు విపరీతమైన డిమాండ్ పెరిగింది.

# ఆర్టీసీ సమ్మె

### డిపోలకే పరిమితమైన బస్సులు





- అర్ధరాత్రి నుంచి సమ్మె సైరన్
- ప్రయాణికుల పాట్లు.. మెట్రో రైళ్ల రద్దీ
- కరీంనగర్‌లో అద్దె బస్సు ప్రమాదం
- చర్చలకు సిద్ధమన్న ఆర్టీసీ ఎండీ

**హైదరాబాద్, ఏప్రిల్ 22:** చాలాలకాలం తరవాత ఆర్టీసీ బస్సులు సేదదీరుతున్నాయి. సమ్మె కారణంగా అన్ని బస్సులు ఆయా డిపోలకే పరిమితం అయ్యాయి. తెలంగాణవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో బస్ డిపోల్లో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. మిగతా 2 లో





## సమ్మెకు బీఆర్ఎస్ మద్దతు

- కార్మికుల పోరాటానికి సంఘీభావం
- హామీలు అమలు చేయని ప్రభుత్వం
- 3,000 కోట్ల బకాయిలు చెల్లించాలి
- డీఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు



3



## నేడు మహాధర్నా

డిపోల ఎదుట ఉదయం నుంచే నిరసనలు


2

## సమ్మెతో సమస్యలు పరిష్కారం కావు

- వెంటనే సమ్మె విరమించి రండి
- ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి



2



## మాజీ సీఎం నాదెండ్ల మరణం

### చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన నేత


### మంత్రి కందుల దుర్గేశ్ తదితరుల సంతాపం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు (90) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భాస్కర్‌రావు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

2

## కాల్పుల విరమణ పొడిగింపు

### ట్రంప్ సంచలన నిర్ణయం!



- పాకిస్థాన్ విన్నపంతో వెనక్కి తగ్గిన అగ్రరాజ్యం..
- స్పష్టమైన ప్రతిపాదనతో రావాలని ఇరాన్‌కు సూచన
- ట్రూత్ సోషల్ మీడియాలో వెల్లడించిన అధ్యక్షుడు

4

## ఓడిపోయిన వారు షరతులు విధించలేరు!



- ట్రంప్‌కు ఇరాన్ ఘాటు కౌంటర్
- కాల్పుల విరమణ పొడిగింపు ఒక 'డ్రామా'..
- ఆకస్మిక దాడి కోసమే అమెరికా ఎత్తుగడ



# దావోస్, గ్లోబల్ సమ్మిట్ పెట్టుబడులపై ఆరా

**ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీలకు భూ కేటాయింపులు**

**ప్రముఖ కంపెనీలకు తొలి వెడతలో భూములు**

**అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ సూచన**

**హైదరాబాద్, ఏప్రిల్ 22:** ఎంఓయూలు కుదుర్చుకున్న కంపెనీలకు వివిధ ప్రాంతాల్లో కేటాయించాల్సిన భూములకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కంపెనీలకు కల్పించాల్సిన సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలకు సంబంధించి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. పెట్టుబడులకు సంబంధించి దావోస్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో పలు కంపెనీలతో జరిగిన ఎంఓయూ లు, పురోగతిపై సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి చర్చించారు. వివిధ రంగాలలో పెట్టుబడులకు సంబంధించి ఇప్పటి వరకు గ్రౌండ్ అయిన కంపెనీలు, పెండింగ్ వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఫ్యూచర్ సిటీతో పాటు వివిధ ప్రాంతాల్లో సంస్థలకు ప్రాధాన్యతల వారీగా కేటాయించాల్సిన భూ వివరాలను సీఎంకు తెలిపారు. డేటా సెంటర్లకు అవసరమైన నీటిని ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసిన నీటిని వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించాలని సిఎం అన్నారు. పేరున్న బ్రాండ్ సంస్థలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. వీలైనంత త్వరగా ఎంఓయూలు కుదుర్చుకున్న సంస్థలు తమ కార్యకలాపాలు మొదలు పెట్టేలా చూడాలని, ఇందుకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలను కల్పించాలన్నారు.

# వాయిదాల్లో ఓటుకు నోటు కేసు విచారణ

**రెండు వారాలకు వాయిదా వేసిన సుప్రీం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:** ఓటుకు నోటు కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం ఈ కేసును మరో రెండు వారాల తర్వాత విచారిస్తామని తెలిపింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ విజయ్ బిష్ణోయ్ కూడా సభ్యుడిగా ఉన్నారు. మంగళవారం ఈ కేసు విచారణ జరిగింది. ముఖ్యంగా ఈ కేసులో రెండు కీలక పిటిషన్లు విచారణకు వచ్చాయి. ఒకటి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ కాగా, మరొకటి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కీలక నేత సండ్ర వెంకట వీరయ్య దాఖలు చేసినది. సీఎం రేవంత్ రెడ్డి తన పిటిషన్‌లో ఓటుకు నోటు కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల ప్రకారమే విచారించాలని కోరారు. ఈ కేసును క్రిమినల్ అవినీతి కేసుగా కాకుండా ఎన్నికల ఉల్లంఘనగా పరిగణించాలని ఆయన వాదించారు. మరోవైపు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తనపై నమోదైన ఈ కేసులో తన పేరును పూర్తిగా తొలగించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. తనపై ఉన్న ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని ఆయన వాదించారు. ఈ రెండు పిటిషన్లను కలిపి విచారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. దీంతో ఈ కేసు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఓటుకు నోటు కేసు గతంలో కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా పడినప్పటికీ, ఈ కేసు ప్రాధాన్యం మాత్రం తగ్గలేదు. వచ్చే విచారణలో కోర్టు తీసుకునే నిర్ణయాలు రాజకీయంగా కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, నైతిక విలువలపై ఈ కేసు కీలకంగా నిలుస్తోంది.

# కాళేశ్వరంపై సీబీఐ విచారణకు సిద్ధమా?

**నిజాయితీ ఉంటే ముందుకు రండి**

**బీఆర్ఎస్ నాయకత్వానికి మంత్రి పొంగులేటి సవాల్**



**హైదరాబాద్, ఏప్రిల్22 :** వేల కోట్ల ప్రజా ధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు.. ఇప్పుడు రాజకీయ రణరంగంగా మారింది. ఈ ప్రాజెక్టులో ఎక్కడా అవినీతి జరగలేదని, హైకోర్టు తమకు 'క్లీన్ చీట్' ఇచ్చిందని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారంపై రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నిప్పులు చెరిగారు. నిజంగా మీరు నిర్దోషులైతే, మీ నిజాయితీని నిరూపించుకోవడానికి సీబీఐ విచారణకు సిద్ధమా? అంటూ ఆయన విసిరిన సవాల్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. బుధవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పొంగులేటి బీఆర్ఎస్ అగ్ర నాయకత్వంపై విరుచుకుపడ్డారు. కాళేశ్వరంలో ఎలాంటి అక్రమాలు జరగలేదని గొంతు చించుకుంటున్న నేతలు, స్వతంత్ర సంస్థల ద్వారా విచారణ జరిపించడానికి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. విచారణ జరిగితే లక్ష కోట్ల ప్రాజెక్టులో జరిగిన భారీ ఆర్థిక దోపిడీ, కమిషన్ల బాగోతం, కాంట్రాక్టుల లోపాలు అన్నీ బయటపడతాయనే భయం వారిని వెంటాడుతోందని మంత్రి ఎద్దేవా చేశారు. ఈ పాపాల నుంచి తప్పించుకోవడానికే బీజేపీతో చీకటి ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారని ఆయన ఆరోపించారు. మేడిగడ్డ వంటి కీలక బ్యారేజీలు కుంగిపోవడం, పంప్ హౌస్‌లు నీట మునగడం వంటి ఘటనలు కేవలం ప్రకృతి వైపరీత్యాలు కావని మంత్రి స్పష్టం చేశారు. "ఇవి కేవలం సాంకేతిక లోపాలు కావు.. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భారీ అవినీతికి నిలువెత్తు నిదర్శనాలు" అని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరంతో పాటు గత ప్రభుత్వంలో నిర్మించిన చెక్ డ్యామ్‌లు కుప్పకూలడం ప్రజా ధనాన్ని ఏ విధంగా దుర్వినియోగం చేశారో చెబుతున్నాయని గుర్తు చేశారు. వేల కోట్లు ఖర్చు చేసి 'గ్లోబల్ ప్రచారం' చేయడం ద్వారా ప్రజలను ఎంతో కాలం మోసం చేయలేరని హెచ్చరించారు. కేసీఆర్, కేటీఆర్ ఈ అంశంపై స్పష్టమైన సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల చెమట చుక్కతో నిర్మించిన ప్రతి ఇటుకపై, ఖర్చు చేసిన ప్రతి రూపాయిపై లెక్క చెప్పాల్సిన రోజు దగ్గరలోనే ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రజల నమ్మకాన్ని వంచించిన వారిని చట్టం ముందు నిలబెట్టే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గదని తేల్చి చెప్పారు. "నిజం మీ వైపు ఉంటే విచారణకు రండి.. లేదంటే మీ మౌనమే మీ నేరాన్ని ఒప్పుకున్నట్లు అవుతుంది" అని పొంగులేటి హెచ్చరించారు.

# ఆర్టీసీ సమ్మె.. డిపోలకే పరిమితమైన బస్సులు

- అర్ధరాత్రి నుంచి సమ్మె సైరన్
- ప్రయాణికుల పాట్లు.. మెట్రో రైళ్ల రద్దీ
- కరీంనగర్‌లో అద్దె బస్సు ప్రమాదం
- చర్చలకు సిద్ధమన్న ఆర్టీసీ ఎండీ



**హైదరాబాద్, ఏప్రిల్ 22 :** రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో తెలంగాణ వ్యాప్తంగా రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. డిపోల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బస్సులు నడవకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తుండడంతో ఆటోలు, క్యాబ్‌లకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ప్రయాణికుల కోసం ప్రభుత్వం అద్దె బస్సులను ఏర్పాటు చేసింది. అయితే కరీంనగర్‌లో ఓ అద్దె బస్సు లారీని ఢీకొట్టింది. కోతిరాంపూర్ బైపాస్ వద్ద అదుపు తప్పి జరిగిన ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం ధ్వంసమై ప్రయాణికులు గాయపడ్డారు. శిక్షణ లేని డ్రైవర్లతో బస్సులు నడపడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల కండక్టర్లు లేకుండానే బస్సులను నడుపుతున్నారు. బస్సులు లేకపోవడంతో నగరవాసులు మెట్రో రైళ్లపై ఆధారపడుతున్నారు. రద్దీని తట్టుకోవడానికి అధికారులు 56 రైళ్లను అందుబాటులోకి తెచ్చారు. మియాపూర్–ఎల్బీ నగర్ కారిడార్‌లో 4 నిమిషాల 20 సెకన్ల విరామంతో, నాగోల్–రాయదుర్గం కారిడార్‌లో 3 నిమిషాల 40 సెకన్ల విరామంతో రైళ్లను నడుపుతున్నారు. రాత్రి 11 గంటల తర్వాత కూడా మెట్రో సేవలను పొడిగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. కార్మికుల సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆర్టీసీ ఎం,డీ నాగిరెడ్డి తెలిపారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కొన్ని సంఘాలు కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆయన విమర్శించారు. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా సమ్మె విరమించాలని కోరారు. అయితే తమ డిమాండ్లు తీరే వరకు పోరాటం ఆపేది లేదని ఆర్టీసీ జేఏసీ స్పష్టం చేసింది.

# నేడు మహాధర్నా

**డిపోల ఎదుట ఉదయం నుంచే నిరసనలు**

**వెనక్కి తగ్గేది లేదన్న జేఏసీ నేతలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 22:** తమ డిమాండ్ల పరిష్కారం కోసం టీజీఎస్ ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం నుంచి మరింత ఉధృతం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట మహాధర్నా నిర్వహించాలని జేఏసీ పిలుపునిచ్చింది. ఉదయం 5 గంటల నుంచే కార్మికులు ఈ నిరసనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం, యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తూ కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని నేతలు ఆరోపించారు. చర్చల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్న విమర్శించారు. ప్రభుత్వం వేసిన కమిటీ అధికారులు సమస్యలను ఇప్పుడప్పుడే పరిష్కరించలేమని చెప్పడం శోచనీయమన్నారు. దీంతో కార్మికులకు సమ్మె తప్ప మరో దారి లేకపోయిందని స్పష్టం చేశారు. బుధవారం అమరవీరులకు నివాళులర్పించి ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని నేతలు కోరుతున్నారు. 2021 వేతన సవరణను 30 శాతం తగ్గకుండా అమలు చేయాలని, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రైవేటు ఎలక్ట్రిక్ బస్సులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇతర జోన్లకు చేసిన ఉద్యోగుల బదిలీ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని స్పష్టం చేశారు. అన్ని డిపోలు, యూనిట్లు, వర్క్ షాపుల్లో ధర్నాలు మిన్నంటుతాయని పేర్కొన్నారు. ఆర్టీసీ పోరాటానికి ప్రజా సంఘాల నుంచి భారీ మద్దతు లభిస్తోంది. ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ మాదిగ, బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్ కృష్ణయ్య ఈ సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చలకు ఆహ్వానించాలని, లేనిపక్షంలో ఈ పోరాటం మరో 'సకల జనుల సమ్మె'గా మారుతుందని ఈదురు వెంకన్న హెచ్చరించారు. కార్మికుల సమస్యలు తీరే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు.



# మాజీ సీఎం నాదెండ్ల భాస్కర రావు మృతి

**చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన నేత**

**మంత్రి కందుల దుర్గేశ్ తదితరుల సంతాపం**

**హైదరాబాద్, ఏప్రిల్ 22:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు (90) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భాస్కర్ రావు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. 1935 జూన్ 23న గుంటూరులో జన్మించిన నాదెండ్ల భాస్కర్ రావు 1978లో విజయవాడ ఈస్ట్ నుంచి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1978 నుంచి 1989 వరకు ఎమ్మెల్యేగా కొనసాగారు. 1986 ఆగస్ట్ 16 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను పదవీచ్యుతిడిని చేసిన నాదెండ్ల నెలరోజులపాటు సిఎంగా కొనసాగారు. నాదెండ్ల భాస్కర్ రావు మృతిపట్ల సినీ, రాజకీయ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాదెండ్ల భాస్కర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ సంతాపం తెలియజేశారు. నాదెండ్ల భాస్కర్ రావు కుమారుడు నాదెండ్ల మనోహర్ ప్రస్తుతం జనసేన పార్టీ తరపున ఏపీ మంత్రిగా సేవలందిస్తున్నారని తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నాదెండ్ల భాస్కర రావు(90) కన్నుమూశారు. గత నెల రోజులుగా నాదెండ్ల భాస్కరావు మృతి పట్ల మంత్రి కందుల దుర్గేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'భాస్కరరావు మృతి రాజకీయ రంగానికి తీరని లోటు. ఎంతోమంది నేతలకు రాజకీయ ఓనమాలు నేర్పిన గొప్ప మార్గదర్శి నాదెండ్ల భాస్కర్ రావు. ప్రజా ప్రతినిధిగా భాస్కరరావు చేసిన సేవలు చిరస్మరణీయం. 1980వ దశకంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంలో ఆయన కీలక పాత్ర పోషించారు. స్వల్పకాలం ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటికీ, అంతకుముందు మంత్రిగా ఆయనకు పరిపాలనపై గట్టి పట్టు ఉండేది. చట్టసభల పనితీరుపై ఆయనకు అపారమైన అవగాహన ఉంది. గుంటూరు జిల్లా నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తనదైన ముద్ర వేశారు' అని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాదెండ్ల భాస్కర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.



# సమ్మెతో సమస్యలు పరిష్కారం కావు

**వెంటనే సమ్మె విరమించి రండి**

**ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి**



**హైదారబాద్, ఏప్రిల్ 22:** ఆర్టీసీ సమ్మెను విరమించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమస్యలకు సమ్మె పరిష్కారం కాదని ఆయన సూచించారు. సమస్యల పరిష్కారానికి నలుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేసిందని.. 4 వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించామని తెలిపారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తామనడం పొరపాటు అని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన 32 అంశాల్లో 29 అంశాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి వ్యతిరేకత లేదని పొన్నం ప్రభాకర్ తెలిపారు. అవన్నీ వెంటనే పరిష్కారమయ్యే అంశాలని పేర్కొన్నారు. ఆర్టీసీ విలీనం, గుర్తింపు సంఘాల ఎన్నికలు రెండు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఈ రెండు అంశాల్లో పలు సాంకేతిక అంశాలు చర్చించాల్సి ఉందన్నారు. వీటిపై అధ్యయనం చేసేందుకే నాలుగు వారాల గడువు అడిగామని వివరించారు. ఈ రెండు అంశాలు కూడా సీఎం, డిప్యూటీ సీఎం దగ్గర చర్చిస్తామని అన్నారు. ఆర్టీసీ విలీనం ఆలస్యమైనప్పటికీ.. ఉద్యోగులకు ఒకటో తారీఖు జీతాలు వస్తున్నాయని పొన్నం ప్రభాకర్ తెలిపారు. గుర్తింపు సంఘాల ఎన్నికల విషయంలో నాయకుల మధ్య అంతర్యుద్ధం, నాయకత్వ అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటుందని.. అన్ని అంశాలను పరిష్కరిస్తామని చెప్పారు. మిమ్మల్ని ఎవరూ అడ్డుకోరని.. ప్రజాస్వామ్య పద్ధతిలో మీ నాయకులు నిరసన తెలపవచ్చని.. ప్రజలపై ఒత్తిడి తీసుకురావచ్చని అన్నారు. అయితే పేద ప్రజల ప్రయాణాలకు ఇబ్బంది కలగజేయవద్దని విజ్ఞప్తి చేశారు. మీ నాయకులు నిరసన తెలపవచ్చని.. మిగతా వారంతా విధుల్లో చేరి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరారు.

# కాళేశ్వరం కేసులో కేసీఆర్‌కు ఊరట!

- ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై హైకోర్టు కీలక ఆదేశం
- పిటిషనర్లపై చర్యలు తీసుకోవద్దని వెల్లడి
- నివేదిక లీకేజీపై ధర్మాసనం అసహనం



**హైదరాబాద్, ఏప్రిల్ 22:** కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా పిటిషనర్లపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ధర్మాసనం ఆదేశించింది. కమిషన్ ఏర్పాటు చట్టబద్ధమేనని పేర్కొన్న కోర్టు, నివేదికలోని అంశాలను అసెంబ్లీలో చర్చించకుండానే మీడియాకు వెల్లడించడాన్ని తప్పుబట్టింది. దీంతో కేసీఆర్, హరీశ్‌రావుతో పాటు అధికారులైన స్మితా సబర్వాల్, ఎస్కే జోషికి ఊరట లభించినట్లయింది.

**నివేదిక లీకేజీపై కోర్టు ఆగ్రహం**

కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ ప్రభుత్వం 2024 మార్చిలో జీవో నంబర్ 6 ద్వారా జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ ఏర్పాటును సవాల్ చేస్తూ కేసీఆర్ బృందం దాఖలు చేసిన పిటిషన్లపై సుదీర్ఘ విచారణ జరిపిన హైకోర్టు, ఈ రోజు తుది తీర్పు వెల్లడించింది. నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టకముందే మీడియా ముందుకు తీసుకురావడంపై అసహనం వ్యక్తం చేసింది. ఈ నివేదిక ఆధారంగా సీబీఐ దర్యాప్తు కోరడం లేదా ఇతర చర్యలు చేపట్టడం చెల్లదని స్పష్టం చేసింది.

**చట్టబద్ధత ఉన్నా చర్యలకు బ్రేక్**

హైకోర్టు తీర్పుపై కేసీఆర్ తరపు న్యాయవాది గండ్ర మోహన్ రావు స్పందిస్తూ.. ఇది తమకు పెద్ద ఊరట అని పేర్కొన్నారు. సెక్షన్ 8 కింద సరైన విచారణ జరగలేదని కోర్టు గుర్తించిందని తెలిపారు. కమిషన్ నివేదికను ఇప్పుడు పక్కన పెట్టవచ్చని, దాని ఆధారంగా ఎలాంటి విచారణలు జరపడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టంగా చెప్పిందని ఆయన వెల్లడించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోను కోర్టు సమర్థించినప్పటికీ, నివేదిక అమలుపై ఆంక్షలు విధించడం పిటిషనర్లకు లబ్ధి చేకూర్చే అంశమేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI



# నేడు తెలంగాణ కేబినెట్ భేటీ!

## కాళేశ్వరం తీర్పుపై ప్రభుత్వం కీలక చర్చ

**హైదరాబాద్, ఏప్రిల్ 22:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ రోజు తెలంగాణ మంత్రివర్గ అత్యవసర సమావేశం జరగనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించింది. ఈ తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం తీసుకోబోయే తదుపరి కార్యాచరణను ఖరారు చేసేందుకు ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. హైకోర్టు తీర్పుపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ.. బీఆర్ఎస్ నేతలు ఆశించినట్లుగా వారికి కోర్టు నుంచి ఎలాంటి 'క్లీన్ చిట్' లభించలేదని స్పష్టం చేశారు. కేసీఆర్.. హరీశ్‌రావు కోరుకున్నట్లుగా కమిషన్ ఏర్పాటును కోర్టు తప్పుబట్టలేదని ఆయన వివరించారు. కేవలం కొన్ని సాంకేతిక అంశాలను మాత్రమే న్యాయస్థానం ప్రస్తావించిందని.. కమిషన్ నియామకాన్ని సమర్థించడం ప్రభుత్వ ధోరణికి దక్కిన విజయమని ఆయన అభిప్రాయపడ్డారు. మంత్రివర్గ సమావేశంలో హైకోర్టు తీర్పులోని అంశాలను లోతుగా విశ్లేషించనున్నారు. కాళేశ్వరం అక్రమాలపై విచారణను మరింత పకడ్బందీగా ఎలా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై మంత్రులతో సీఎం చర్చించనున్నారు. ఈ భేటీ తర్వాత ప్రభుత్వం తన అధికారిక నిర్ణయాన్ని వెల్లడించే అవకాశం ఉంది. ప్రాజెక్టు విషయంలో నెలకొన్న న్యాయపరమైన ఉత్కంఠకు ఈ సమావేశం ఒక దిశను చూపే అవకాశం కనిపిస్తోంది.

- తదుపరి అడుగులపై లోతైన విశ్లేషణ
- కమిషన్ ఏర్పాటును కోర్టు సమర్థించింది
- మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం





# కాంగ్రెస్ సర్కార్‌కు హైకోర్టు చెంపపెట్టు!

**కాళేశ్వరం విచారణలో రేవంత్ ప్రభుత్వం వైఫల్యం**
**కోర్టులో సాక్ష్యాలు చూపలేక చేతులెత్తేసిన వైనం**
**బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య లోపాయికారి ఒప్పందం**
**కేంద్రమంత్రి జీ కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 22:** కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి విచారణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేంద్రమంత్రి జీ కిషన్ రెడ్డి ఆరోపించారు. బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతను మరోసారి బట్టబయలు చేసిందని విమర్శించారు. వేల కోట్ల అక్రమాలు జరిగాయని ప్రచారం చేసిన పాలకులు, ఆ సాక్ష్యాలను న్యాయస్థానం ముందు సమర్థవంతంగా ఉంచలేకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ మేరకు ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా ఆధారాలు సమర్పించడంలో విఫలమవడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని దుయ్యబట్టారు. అధికారంలోకి రాగానే కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకుంటామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు వారితో కలిసి 'డూప్ ఫైటింగ్' చేస్తోందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. "నేను గిచ్చినట్లు చేస్తా, నువ్వు ఏడ్చినట్లు చెయ్" అన్న చందంగా రెండు పార్టీల వ్యవహారం ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల వేళ పెద్ద పెద్ద మాటలు చెప్పిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక రెండేళ్లయినా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ కేవలం మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదని ఈ తీర్పుతో రుజువైందన్నారు. కాళేశ్వరంతో పాటు ఫార్ములా వన్ రేసు, డ్రగ్స్ కేసులు, భూ ఆక్రమణలు, మిషన్ భగీరథ లాంటి పథకాల్లో భారీ అక్రమాలు జరిగాయని చెప్పిన సీఎం, వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. అవినీతి సొమ్మును కక్కించి పేదలకు పంచుతామన్న హామీ ఏమైందని నిలదీశారు. తెలంగాణ ప్రజలను రెండు పార్టీలు కలిసి మోసం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాలయాపన మానుకుని, అక్రమాలకు పాల్పడిన వారిపై పారదర్శకమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ వైఫల్యానికి రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# కాళేశ్వరంలో ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

**పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు రాజ్యాంగబద్ధమే**
**సీబీఐ విచారణకు హైకోర్టు తీర్పు అడ్డంకి కాదు**
**నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**హైదరాబాద్, ఏప్రిల్ 22:** కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తెలంగాణ హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు సరైందేనని న్యాయస్థానం అభిప్రాయపడిందని ఆయన తెలిపారు. బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కమిషన్ నియామకం కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 6 చట్టబద్ధమైనదని, అది అధికార పరిధిని మించి ఏమీ లేదని కోర్టు స్పష్టం చేసినట్లు వివరించారు. కమిషన్ ఏర్పాటు అక్రమమని పిటిషనర్లు చేసిన వాదనను కోర్టు తోసిపుచ్చిందని ఆయన పేర్కొన్నారు. హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు ఎలాంటి అడ్డంకి కాదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. కాళేశ్వరంలో జరిగిన అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని తమ ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిందని గుర్తు చేశారు. గత ఏడాది సెప్టెంబర్ 1వ తేదీనే దీనిపై జీవోతో పాటు నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. ఈ రోజు వచ్చిన తీర్పు కేవలం నోటీసుల జారీ వంటి సాంకేతిక అంశాలకు సంబంధించిందే తప్ప, అవినీతిపై సాగే విచారణను ఆపలేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోవడం అనేది ముమ్మాటికీ మానవ తప్పిదమేనని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు సైట్ ఎంపిక నుంచి డిజైన్ల తయారీ, నిర్మాణం, నిర్వహణ వరకు అన్ని దశల్లోనూ లోపాలు ఉన్నాయని విజిలెన్స్ కమిషన్, ఎన్డీఎస్ఏ ఇప్పటికే తేల్చాయని చెప్పారు. లక్ష కోట్ల ప్రజా ధనంతో నిర్మించిన బ్యారేజీలు మూడేళ్లకే కుంగిపోవడం దేశంలోనే అతిపెద్ద విధ్వంసం అని అభివర్ణించారు. ఏటా ఈ ప్రాజెక్టు అప్పులు, వడ్డీల రూపంలోనే 15 నుంచి 20 వేల కోట్ల రూపాయల భారం ప్రభుత్వంపై పడుతోందని ఆయన వివరించారు. న్యాయస్థానం నివేదికలోని కొన్ని వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, అది కేవలం నోటీసులు ఇవ్వలేదనే కారణం వల్లే జరిగిందన్నారు. పూర్తి తీర్పు కాపీ వచ్చిన తర్వాత ప్రభుత్వం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఈ అక్రమాలకు ఎవరు బాధ్యులో, ఎవరు దోషులో తేల్చి తీరుతామని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన తీరును ఎవరైనా స్వయంగా చూడవచ్చని, ఇంత పెద్ద నష్టానికి బాధ్యులైన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు.

# పీసీ ఘోష్ నివేదికకు విలువే లేదు

**అది కమిషన్ కాదు.. పీసీసీ నివేదిక : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్, ఏప్రిల్ 22:** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై హైకోర్టు వెలువరించిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలకు చెంపపెట్టు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు.. ముమ్మాటికీ పీసీసీ నివేదిక అని తాము మొదటి నుంచీ చెబుతున్న మాట నేడు అక్షరసత్యమని నిరూపితమైందని అన్నారు. కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నించిన వారికి ఈ తీర్పు గుణపాఠమని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పుతో తెలంగాణ ప్రజలు.. రైతులు.. ఇంజనీర్లకు విజయం చేకూరిందని కేటీఆర్ తెలిపారు. మూడేళ్లుగా కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరంపై దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. తెలంగాణలో పారుతున్న ప్రతి నీటి బొట్టు వెనుక కేసీఆర్ కృషి ఉందని.. భూమిపై గోదావరి ప్రవహించినంత కాలం ఆయన చరిత్రను ఎవరూ చెరపలేరని స్పష్టం చేశారు. ప్రాజెక్టు కోసం రూ. 94 వేల కోట్లు ఖర్చు చేస్తే.. రూ. లక్ష కోట్లు అంటూ తప్పుడు ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం మేడిగడ్డ బ్యారేజీపై రూ. 3,800 కోట్లు మాత్రమే వెచ్చించామని వివరించారు.

# అనిల్ జైన్ పై చర్య తీసుకోండి!

**ఎన్డీఎస్ఏ ఛైర్మన్ తీరుపై బండి సంజయ్ ఆగ్రహం**
**సీఎం పర్యటనలో పాల్గొనడంపై అభ్యంతరం**



**హైదరాబాద్, ఏప్రిల్ 22:** నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఛైర్మన్ అనిల్ జైన్ పై తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం కేంద్ర జలశక్తి మంత్రికి లేఖ రాశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన కార్యక్రమంలో అనిల్ జైన్ పాల్గొనడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నెల 20వ తేదీన కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే సీఎం మేడిగడ్డను సందర్శించారని.. అటువంటి కార్యక్రమంలో ఒక బాధ్యతాయుతమైన అధికారి ఎలా పాల్గొంటారని సంజయ్ ప్రశ్నించారు. భవిష్యత్తులో బ్యారేజీలకు ఏవైనా నష్టం వాటిల్లితే ఆ నిందను ఎన్డీఎస్ఏ మీదకు నెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బండి సంజయ్ హెచ్చరించారు. కమిటీ ఇచ్చిన నివేదికలు, సిఫార్సులను నీరుగార్చేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. అనిల్ జైన్ వ్యవహారశైలిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తన లేఖలో కోరారు.

# ఆరుగురు ఐపీఎస్ అధికారులకు డీజీ హోదా!

**తెలంగాణలో సీనియర్లకు పదోన్నతులు**
**1995, 1996 బ్యాచ్ అధికారులకు ప్రమోషన్**
**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**

**హైదరాబాద్, ఏప్రిల్ 22:** తెలంగాణలో పనిచేస్తున్న ఆరుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు ప్రభుత్వం డైరెక్టర్ జనరల్ (డీజీ) హోదా కల్పించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. 1995, 1996 బ్యాచ్‌లకు చెందిన అధికారులకు ఈ పదోన్నతులు లభించాయి. 1995 బ్యాచ్‌కు చెందిన మహేష్ భగవత్.. స్వాతి లక్రా.. వీవీ శ్రీనివాసరావు డీజీ హోదా పొందారు. వీరితో పాటు 1996 బ్యాచ్‌కు చెందిన చారు సిన్హా.. అనిల్ కుమార్.. వీసీ సజ్జనార్‌కు కూడా డైరెక్టర్ జనరల్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ పదోన్నతుల ద్వారా పోలీస్ శాఖలో మరింత పారదర్శకత.. వేగవంతమైన సేవలు అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

# పోటు రంగారావుపై ఎన్ఐఏ ప్రశ్నల వర్షం!

**ఖమ్మం పార్టీ ఆఫీసులో రెండున్నర గంటల పాటు విచారణ**
**గాదె ఇన్నయ్యతో సంబంధాలు, కగార్ అంశాలపై ఆరా**
**మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి విచారణ**

**ఖమ్మం, ఏప్రిల్ 22:** మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావును బుధవారం ఎన్ఐఏ అధికారులు విచారించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయం రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నలుగురు అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. సుమారు రెండున్నర గంటల పాటు ఈ విచారణ ప్రక్రియ కొనసాగింది. విచారణ అనంతరం పోటు రంగారావు మీడియాతో మాట్లాడుతూ.. అధికారులు తన విద్యాభ్యాసం, వివాహం, సంతానం వంటి వ్యక్తిగత వివరాలను అడిగారని తెలిపారు. ముఖ్యంగా గాదె ఇన్నయ్యతో ఉన్న సంబంధాలపై ఆరా తీశారని పేర్కొన్నారు. హెడ్మా తల్లిని ఓదార్చిన అంశంలో ఆర్థిక సాయం, నిషేధిత పార్టీలతో ఉన్న విభేదాలపై కూడా ప్రశ్నలు సంధించినట్లు వెల్లడించారు. "కగార్ ను ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?", "ఎన్ఐఏ పట్ల సమాజంలో భయాందోళనలు ఎందుకు రేకెత్తిస్తున్నారు?", "కగార్ కు వ్యతిరేకంగా ఎందుకు నిరసనలు చేపట్టారు?" వంటి అంశాలపై అధికారులు తనను ప్రశ్నించారని రంగారావు వివరించారు. ఎన్ఐఏ అధికారులు రంగారావును విచారిస్తున్నారన్న సమాచారంతో పార్టీ నాయకులు, లాయర్లు పెద్ద ఎత్తున కార్యాలయానికి చేరుకున్నారు.





# టెర్రరిస్టుపై నోటీసులు

**24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని వివరణ ఖర్గేకు ఈసీ ఆదేశం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి 'టెర్రరిస్టు' అంటూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలను ఎన్నికల కమిషన్ తీవ్రంగా పరిగణించింది. 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ఖర్గేకు నోటీసు పంపింది. ఖర్గే వ్యాఖ్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా ఉన్నందున ఆయనపై చర్య తీసుకోవాలని, బహిరంగంగా క్షమాపణ చెప్పాల్సిందిగా ఆదేశించాలని బీజేపీ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఈసీకి బుధవారం ఉదయం ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఖర్గే వివరణ కోరుతూ ఎన్నికల కమిషన్ నోటీసు ఇచ్చింది. ప్రధానమంత్రిని ఉగ్రవాదిగా పేర్కొనడం యావద్దేశాన్ని అవమానించడమేనని బీజేపీ ప్రతినిధుల బృందంలోని నిర్మలా సీతారామన్, కిరణ్ రిజిజు, అర్జున్ రామ్ మేఘ్వాల్ ఈసీకి ఫిర్యాదు చేశారు. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడంతో పాటు భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 175 కింద నేరమవుతుందని, పరువునష్టం కేసు వేసేందుకు అవసరమైన ప్రాథమిక సాక్ష్యంగా ఆయన వ్యాఖ్యలు నిలుస్తాయని ఈసీ దృష్టికి తెచ్చారు. అన్నాడీఎంకే, బీజేపీ పొత్తుపై ఖర్గే తమిళనాడు ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ, ఆ పార్టీ మోదీతో ఎలా చేతులు కలిపిందని ప్రశ్నించారు. ఆయనకు సమానత్వం, న్యాయంపై నమ్మకం లేవన్నారు. అలాంటి వాళ్లతో అన్నాడీఎంకే కలవడమంటే ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమేనని విమర్శించారు. ఖర్గే చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించడంతో ఆయన తిరిగి వివరణ ఇచ్చారు. మోదీని తాను ఎప్పుడూ ఉగ్రవాది అని అనలేదని, ప్రజలు, రాజకీయ పార్టీలను ఆయన భయభ్రాంతులకు గురి చేస్తున్నారని చెప్పడమే తన ఉద్దేశమని వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో కిరణ్ రిజిజు మాట్లాడుతూ, ఈసీఐని బీజేపీ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం కలిసినట్టు చెప్పారు. ఎంతో బాధ, ఆగ్రహంతో తాము ఇక్కడకు వచ్చామన్నారు. ప్రధానమంత్రి మోదీని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అవమానించిన తీరే ఇందుకు కారణమని అన్నారు. ప్రధానమంత్రిని ఉగ్రవాదిగా పేర్కొనడం యావద్దేశాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు. దీనికి ముందు, ఖర్గే వ్యాఖ్యల వివాదంపై ఎన్నికల కమిషన్‌కు బీజేపీ ఒక లేఖ రాసింది. ఖర్గే వ్యాఖ్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడం కిందకు వస్తుందని పేర్కొంది.

# ఆర్టీసీ సమ్మెకు బీఆర్ఎస్ మద్దతు!

**కార్మికుల పోరాటానికి సంఘీభావం**
**మాజీ మంత్రి హరీశ్‌రావు**




**హైదరాబాద్, ఏప్రిల్ 22:** ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ సంఘీభావం తెలుపుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ గత కేసీఆర్ ప్రభుత్వమే క్యాబినెట్ ఆమోదం తెలిపిందని.. జీవోలు, గెజిట్ కూడా జారీ చేసిందని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో చెప్పిన హామీలనే అమలు చేయాలని కార్మికులు కోరుతున్నారని ఆయన పేర్కొన్నారు. రెండున్నరేళ్లు దాటుతున్నా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోవడం వల్లే కార్మికులు సమ్మె బాట పట్టారని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని.. కార్మికులతో తక్షణమే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వారి న్యాయమైన కోరికలను తీర్చాలని సూచించారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి ప్రభుత్వం నుంచి సుమారు రూ. 3,000 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని ఆయన తెలిపారు. ఈ నిధులు రాకపోవడం వల్లే ఉద్యోగులకు డీఏలు.. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే ఈ బకాయిలు చెల్లించి సంస్థను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల పక్షాన బీఆర్ఎస్ ఎప్పుడూ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# ధర్మమే గెలిచింది

**ఘోష్ కమిషన్ నివేదికపై కోర్టు స్టేతో ఊరట**
**బట్టబయలైన కాంగ్రెస్ రాజకీయ కుట్రలు**
**కాళేశ్వరమే తెలంగాణకు ప్రాణేశ్వరం : మాజీ మంత్రి హరీశ్‌రావు**


**హైదరాబాద్, ఏప్రిల్ 22:** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై మాజీ మంత్రి హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా అంతిమంగా ధర్మమే గెలుస్తుందని, ఈ రోజు సత్యం నిలబడిందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తన స్పందనను తెలియజేశారు. ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ సాగిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టడం హర్షణీయమని తెలిపారు. వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా కమిషన్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని కోర్టు స్పష్టం చేసిందని హరీశ్‌రావు అన్నారు. ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోకూడదని కోర్టు ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్ ప్రభుత్వం పన్నిన రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయని విమర్శించారు. ప్రజల సమస్యలను పక్కన పెట్టి డ్రామాలాడుతున్న రేవంత్ రెడ్డి నిజస్వరూపం ఈ తీర్పుతో తేటతెల్లమైందని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కక్షసాధింపులు, రాజకీయ దుష్ప్రచారం మానుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. వెంటనే కుంగిన పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఎవరు అవునన్నా కాదన్నా కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు మణిహారం లాంటిదని, అది ఎప్పటికీ రాష్ట్రానికి ప్రాణేశ్వరమని కొనియాడారు. జై తెలంగాణ, జై కేసీఆర్ అంటూ తన పోస్టును ముగించారు.



సంపాదకీయం

# ర్యాంకుల గోలతో విద్యార్థులపై ఒత్తిడి!

టీవీలు, పేపర్ల నిండా ర్యాంకుల గోల. మా వద్ద చదివిన వారికి ర్యాంకులే ర్యాంకులు అంటూ... ప్రకటనలు.. 1,2,3 ఇలా టీవీల్లో ఊదరగొడుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే...ర్యాంకుల గొడవలో పిల్లల్లో సృజనాత్మకతను దెబ్బతీస్తున్నారు. లక్షల్లో ఫీజులు వసూళ్లు చేసి, పేద మధ్యత తరగతి వారిని మాయలో పడేస్తున్నారు. ఇంతపెద్ద దేశంలో ఇలాంటి చదువులు సాగుతున్నందుకు సిగ్గుపడాలి. ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా భ్రష్టు పడుతోంది. ప్రభుత్వ హాస్టళ్లు నానాటికి తీసికట్టుగా తయారవుతున్నాయి. విద్యార్థులకు సరైన తిండి దక్కడం లేదు. ఫుడ్ పాయిజనింగ్‌తో చస్తున్నారు. అయినా పెద్దగా చర్యలు తీసుకోవడం లేదు. నానా రకాల పేర్లతో హాస్టళ్లు పెట్టి పిల్లలను ఘోష పెడుతున్నారు. ఇక ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజలు కట్టుకోలేనంత, తట్టుకోలేనంతగా ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు కూడా లేదు. తల్లిదండ్రులు ధర్నాలు చేసినా, ఫీజలు భారం నుంచి తప్పించడం లేదు. జీవితమంటే చదువులు, మార్కులు, ర్యాంకులే అన్న విధంగా విద్యారంగం తయారయ్యింది. ప్రైవేట్ మాఫియాలో అసలు విద్య గంగలో కలసిపోతోంది. ర్యాకులే విజయానికి కొలమానాలుగా మారాయి. నేటి విద్యావిధానం మార్కులు, ర్యాంకుల చుట్టూనే తిరుగుతోంది. పిల్లల ప్రతిభను ఈ కొలమానంతో కొలవడం దారుణం. ర్యాంకుల వేటలో పిల్లల మానసిక ఒత్తిడిని పెంచుతున్నారు. ఇటీవలి కాలంలో విద్యార్థుల ఆత్మహత్యలు సామాజిక సమస్యగా మారింది. చదివేది, పరీక్షలు రాసేదీ విద్యార్థులైతే, వాటి ఫలితాల కోసం ఎదురు చూసేది, వారి భవితపై అంచనాలు పెంచుకునేది వారి తల్లిదండ్రులు. వారి ర్యాంకులతో వ్యాపారం చేసేది ఆయా విద్యాసంస్థలు. ఈ ఒత్తిళ్ల మధ్య చదువులు, ర్యాంకుల వాతావరణానికి తోడు రకరకాల ఆర్థిక, సామాజిక, వివక్షల వంటి అనేక కారణాలు విద్యార్థుల్లో విపరీతమైన మానసిక సమస్యలను సృష్టిస్తున్నాయి. తల్లిదండ్రుల అంచనాల ను, విద్యాసంస్థల ఒత్తిళ్లను తట్టుకోలేక కుంగుబాటుతో, నిస్సహాయతతో కొందరు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. తాజాగా వచ్చిన ఇంటర్ ఫలితాల అనంతరం పదుల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పరీక్షల్లో ఫెయిలైతే జీవితం ముగిసిపోయినట్లే అన్న భావనలో..ఆత్మహత్యలే శరణ్యమని భావిస్తున్నారు. జీవితంలో చదువు, కెరీర్ ఒక భాగం మాత్రమే. అని వారికి అవగాహన కల్పించడం లేదు. మంచిచెడుల విచక్షణను తెలియజెప్పడం లేదు. ఇంటర్ ఫలితాలు వచ్చాక ఇటీవల తెలంగాణలో ఒక్క రోజులోనే ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే, ఎపి లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. టెన్త్, ఇంటర్ ఫలితాలొచ్చిన ప్రతిసారీ చిన్నారుల ఆత్మహత్యల వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. కార్పొరేట్ విద్యా ఫ్యాక్టరీలు ర్యాంకుల కోసం విద్యార్థులను యంత్రాల్లా మార్చుతున్నాయి. పిల్లలపై తల్లిదండ్రుల అంచనాలకు హద్దు లేకుండా పోతోంది. వారి అంచనాలను అందుకోలేక మరొకరితో పోల్చడాన్ని తట్టుకోలేక.. బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇవి కేవలం పిల్లల వ్యక్తిగత వైఫల్యాల ఫలితం కాదు. సమాజం, విద్యావ్యవస్థలోని లోపాలను ప్రతిబింబిస్తోంది. సుప్రీంకోర్టు సైతం ఇది వ్యవస్థాగత లోపానికి నిదర్శనం అని వ్యాఖ్యానించిందంటే.. పరిస్థితి తీవ్రత ఎంతగా వుందో అర్థం చేసుకోవచ్చు. పరీక్షల ఒత్తిడిలో వున్న పిల్లలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. వారికి మానసిక స్థయిర్యాన్ని ఇవ్వడం ముఖ్యం. మార్కులు, ర్యాంకుల కోసమే పుట్టలేదన్న విషయం పిల్లల్లో నూరిపోయాలి. ఫెయిలైతే మళ్లీ చదువుకునేందుకు అవకాశం ఉంది. అసలు చదువే ఇష్టం లేకపోతే అభిరుచి వున్న మరో రంగంలో సత్తా చాటడానికి విశాల ప్రపంచం ఉంది. తరగతి గదిలో వెనకబడిన వారు జీవితంలో అద్భుతాలు సాధించిన ఘటనలు అనేకం చరిత్రలో వున్నాయి. సచిన్ టెండూల్కర్, ధోనీ వంటి ప్రముఖ క్రికెటర్లు హైస్కూల్ చదువులతోనే సరిపెట్టుకున్నారు. ఇప్పుడు పేరున్న వారంతా అభిరుచి కలిగిన రంగంలో స్వయంకృషితో ఎదిగినవారే. ఇంటర్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయనో, పదిలో ఫెయిల్ అయ్యామనో తనువు చాలిస్తే భవిష్యత్‌లో దేశం ఒక గొప్పవ్యక్తిని కోల్పోయినట్టే. మన శ్రమతో కొత్త చరిత్రను లిఖించాలి. ఇవన్నీ ఒక ఎత్తయితే విద్యారంగంలో సంస్కరణలు ముఖ్యం. ర్యాంకుల గోల, ఫీజలు గోల పోయేలా ప్రభుత్వరంగంలో స్కూళ్లను, కాలేజీలను బలోపేతం చేయాలి. ఒకేతరహా విద్య అందరికీ అందేలా చేయాలి. ముఖ్యమంగా ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలి. లక్షల్లో ఫీజులు వసూళ్ల దందాను ఆపాలి. అలాగే ర్యాంకుల చదవులను ఆపాలి. పలు తరహాల సిలబస్‌లకు బ్రేక్ వేయాలి. ప్రధానంగా ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేసి, టీచర్లను నియమిస్తే..పేదలు కార్పోరేట్ స్కూళ్ల మోజులో పడరు. వాటి వెనకాల పరుగెత్తరు. ఇది గుర్తించి ఉమ్మడి ఎపిలో ప్రభుత్వాలు చర్యలకు ఉపక్రమించాలి.



# కాల్పుల విరమణ పొడిగింపు

## ట్రంప్ సంచలన నిర్ణయం!

- పాకిస్థాన్ విన్నపంతో వెనక్కి తగ్గిన అగ్రరాజ్యం..
- స్పష్టమైన ప్రతిపాదనతో రావాలని ఇరాన్‌కు సూచన
- ట్రూత్ సోషల్ మీడియాలో వెల్లడించిన అధ్యక్షుడు



**వాషింగ్టన్:** పశ్చిమాసియాలో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాత్కాలికంగా తెరదించారు. ఇరాన్‌తో ముగియనున్న కాల్పుల విరమణ గడువును పొడిగిస్తున్నట్లు ప్రకటించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. అయితే, ఈ నిర్ణయం వెనుక పెద్ద వ్యూహమే దాగి ఉంది. ఇరాన్ నాయకత్వం నుండి ఒక సమగ్రమైన, స్పష్టమైన ప్రతిపాదన వచ్చే వరకు మాత్రమే ఈ వెసులుబాటు ఉంటుందని ఆయన తన 'ట్రూత్ సోషల్' ఖాతా ద్వారా స్పష్టం చేశారు. అసలు అమెరికా ఈ నిర్ణయం ఎందుకు తీసుకుంది? దీని వెనుక పాకిస్థాన్ జరిపిన రాయబారం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. పాక్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన అభ్యర్థన మేరకు.. సైనిక చర్యను వాయిదా వేసి, దౌత్యపరమైన చర్చలకు మరో అవకాశం ఇవ్వాలని ట్రంప్ నిర్ణయించుకున్నారు. ఇరాన్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు ఉన్నాయని, వారు ఒక స్పష్టమైన నిర్ణయానికి రావడానికి సమయం కావాలన్న ఉద్దేశంతోనే ఈ పొడిగింపు ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే, కాల్పుల విరమణ పొడిగించినంత మాత్రాన ఇరాన్‌కు ఊరట లభించినట్లు కాదు. ఒకవైపు యుద్ధాన్ని వాయిదా వేస్తూనే, మరోవైపు ఇరాన్‌పై 'సముద్ర దిగ్బంధనాన్ని' కఠినతరం చేయాలని ట్రంప్ తన సైన్యాన్ని ఆదేశించారు. ఇది ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీని తీవ్ర ఆగ్రహానికి గురిచేసింది. "కాల్పుల విరమణ అమల్లో ఉండగా వాణిజ్య నౌకలను లక్ష్యం చేసుకోవడం యుద్ధం చేయడంతో సమానం" అని ఆయన మండిపడ్డారు. ఈ కాల్పుల విరమణ అనేది 'అపరిమిత కాలం' కోసం కాదని, ఇరాన్ తన బాధ్యతలను నెరవేర్చడానికి ఇచ్చిన గడువు మాత్రమేనని అమెరికా ఉన్నత అధికారి ఒకరు 'యాక్సియోస్' పత్రికతో వ్యాఖ్యానించారు. ఒకవేళ ఇరాన్ నిబంధనలను ఉల్లంఘించినా, లేదా వారి ప్రాంతీయ ఉగ్రవాద సంస్థలకు మద్దతు నిలిపివేయకపోయినా ఏ క్షణంలోనైనా ఈ ఒప్పందాన్ని రద్దు చేస్తామని అమెరికా హెచ్చరించింది. మరోవైపు, అమెరికా డిమాండ్లు అతిగా ఉన్నాయంటూ పాకిస్థాన్ వేదికగా జరగాల్సిన చర్చలకు హాజరుకాకూడదని ఇరాన్ భావిస్తోంది. ఈ పరిణామాలు చూస్తుంటే, పశ్చిమాసియాలో శాంతి అనేది ఇప్పట్లో సాధ్యమయ్యేలా కనిపించడం లేదు.

# ఓడిపోయిన వారు షరతులు విధించలేరు!

- ట్రంప్‌కు ఇరాన్ ఘాటు కౌంటర్
- కాల్పుల విరమణ పొడిగింపు ఒక 'డ్రామా'..
- ఆకస్మిక దాడి కోసమే అమెరికా ఎత్తుగడ
- దిగ్బంధనం బాంబు దాడుల కంటే ప్రమాదకరం.. వైట్‌హౌస్ చర్చలు రద్దు!



**టెహ్రాన్:** పశ్చిమాసియా ఆకాశంలో యుద్ధ మేఘాలు మళ్లీ కమ్ముకుంటున్నాయి. శాంతి చర్చల పేరిట అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వేసిన ఎత్తుగడను ఇరాన్ అంతే వేగంగా తిప్పికొట్టింది. "యుద్ధంలో ఓడిపోయిన పక్షం ఎప్పుడూ షరతులు విధించదు" అంటూ ఇరాన్ చేసిన ఘాటు వ్యాఖ్యలు ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ట్రంప్ ప్రకటించిన కాల్పుల విరమణ పొడిగింపు వెనుక శాంతి కంటే, సైనిక కుట్ర ఎక్కువగా ఉందన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ సలహాదారు మెహదీ మొహమ్మదీ అమెరికా తీరును తీవ్రంగా ఎండగట్టారు. ట్రంప్ కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటించడం కేవలం ఒక 'డ్రామా' అని ఆయన కొట్టిపారేశారు. అమెరికా సైన్యం తనను తాను సిద్ధం చేసుకోవడానికి, ఇరాన్‌పై ఆకస్మికంగా దాడి చేసేందుకు సమయం దొరకదనే ఉద్దేశంతోనే ఈ గడువు పొడిగింపు ఎత్తుగడ వేశారని ఆరోపించారు. "మాపై బాంబు దాడులు చేయడం కంటే మా నౌకలను దిగ్బంధించడం అత్యంత ప్రమాదకరం. దీనికి సైనికపరంగానే సమాధానం ఉంటుంది" అని ఆయన సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. అంతకుముందు ట్రంప్ మాట్లాడుతూ, ఇరాన్ నాయకత్వం తీవ్ర సంక్షోభంలో ఉందని ఎద్దేవా చేశారు. పాకిస్థాన్ అభ్యర్థన మేరకు దాడులను ఆపుతున్నామని చెబుతూనే, ఆ దేశ పోర్టుల దిగ్బంధనం మాత్రం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇరాన్ రోజుకు 500 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని కోల్పోతోందని, అక్కడ పోలీసులకు, సైన్యానికి జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదని ట్రంప్ వ్యాఖ్యానించడం ఇరాన్‌ను మరింత రెచ్చగొట్టింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో జరగాల్సిన రెండో విడత శాంతి చర్చలు సందిగ్ధంలో పడ్డాయి. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన పాకిస్థాన్ పర్యటనను వాయిదా వేసుకోవడం, పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇటు అమెరికా తన ఆర్థిక ఆంక్షలను సడలించకపోవడం, అటు ఇరాన్ తనపై జరుగుతున్న ఈ దిగ్బంధనాన్ని యుద్ధంగా పరిగణించడంతో దౌత్య ప్రయత్నాలన్నీ విఫలమయ్యేలా కనిపిస్తున్నాయి. రాబోయే కొద్ది గంటలు పశ్చిమాసియా భవిష్యత్తును నిర్ణయించనున్నాయి. ఇరాన్ అన్నట్లుగానే సైనిక సమాధానం ఇస్తుందా? లేక అంతర్జాతీయ ఒత్తిడికి తలొగ్గి చర్చలకు వస్తుందా? అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న.

# భారత్ జోలికొస్తే 'డాట్.. డాట్.. డాట్'

- పాకిస్థాన్‌కు రాజ్‌నాథ్ సింగ్ వార్నింగ్!
- జర్మనీ వేదికగా రక్షణ మంత్రి ఘాటు వ్యాఖ్యలు..
- పశ్చిమాసియా సంక్షోభంపై స్పందన.. మధ్యవర్తిత్వానికి భారత్ సిద్ధం



**ఢిల్లీ, ఏప్రిల్22:** "భారత్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుంది.. ఏ దేశంపై కూడా ముందుగా దాడి చేసిన చరిత్ర మనకు లేదు. కానీ, ఒకవేళ ఎవరైనా మన దేశాన్ని ప్రమాదంలో పడేయాలని చూస్తే మాత్రం, ఆ తర్వాత మా ప్రతిస్పందన ఎలా ఉంటుందో ఆ 'డాట్.. డాట్.. డాట్' లోనే అర్థం చేసుకోండి." జర్మనీ వేదికగా కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు పొరుగు దేశం పాకిస్థాన్‌కు వణుకు పుట్టిస్తున్నాయి. పేరు ప్రస్తావించకుండానే ఆ 'ఒక్క దేశం' తీరును ఆయన ఎండగట్టిన తీరు అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. పహల్గాం ఉగ్రదాడి జరిగి నేటితో ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని జర్మనీలో ఏర్పాటు చేసిన సభలో రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించారు. భారత సైనిక వ్యవస్థ గతంలో కంటే ఇప్పుడు ఎంతో దృఢంగా మారిందని, ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సైన్యం చూపిన ప్రతాపం ప్రపంచానికి తెలుసని గుర్తు చేశారు. పొరుగు దేశాలన్నీ భారత్‌తో సఖ్యంగా ఉన్నాయని, కానీ ఆ ఒక్క దేశం మాత్రం నిరంతరం సమస్యలు సృష్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది ఏప్రిల్ 22న పిరికిపందలు జరిపిన దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయకులకు ఆయన ఘన నివాళులర్పించారు. ఆ దెబ్బను జాతి ఎప్పటికీ మర్చిపోదని, బాధిత కుటుంబాలకు భారత్ అండగా ఉంటుందని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా భరోసా ఇచ్చారు. ఇదే వేదికగా ప్రపంచాన్ని కుదిపేస్తున్న పశ్చిమాసియా ఉద్రిక్తతలపై కూడా రాజ్‌నాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న పరిస్థితులు సద్దుమణగాలని భారత్ ఆకాంక్షిస్తోందని తెలిపారు. ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీ ఇరు దేశాధినేతలతో మాట్లాడారని, శాంతి చర్చల కోసం అవసరమైతే మధ్యవర్తిత్వం వహించేందుకు కూడా భారత్ సిద్ధంగా ఉందని ప్రకటించారు. అగ్రరాజ్యాల మధ్య సయోధ్య కుదిర్చే సత్తా భారత్‌కు ఉందని ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

# అన్ని మతాలకు ఒకే నియమం వర్తించదు

- శబరిమల కేసు విచారణలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- మత స్వేచ్ఛపై ఆసక్తికర చర్చ
- రాజ్యాంగ నైతికతపై న్యాయస్థానం విశ్లేషణ




**ఢిల్లీ, ఏప్రిల్ 22:** శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశం, మతపరమైన ఆచారాల్లో ప్రభుత్వ జోక్యంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం కీలక విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు.. మత స్వేచ్ఛ, రాజ్యాంగ పరమైన హక్కుల మధ్య ఉన్న సున్నితమైన సంబంధాన్ని స్పష్టం చేస్తున్నాయి. మతపరమైన ఆచారాల్లో ప్రభుత్వం ఎంతవరకు జోక్యం చేసుకోవచ్చనే అంశంపై ముందస్తుగా ఎలాంటి ఉమ్మడి లేదా సార్వత్రిక నిబంధనలను విధించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మత స్వేచ్ఛ, సామాజిక సంస్కరణల మధ్య సమతుల్యత అనేది ఆయా కేసుల వాస్తవ పరిస్థితులు, ఆచారాల నేపథ్యంపైనే ఆధారపడి ఉంటుందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ విచారణ కేవలం శబరిమలకే పరిమితం కాకుండా, మసీదుల్లోకి మహిళల ప్రవేశం, పార్శీ మహిళల హక్కుల వంటి ఇతర మతపరమైన అంశాలను కూడా స్పృశిస్తోంది. ఒక మతానికి చెందిన ఆచారం లేదా నిబంధనను ప్రాతిపదికగా తీసుకుని, అదే సూత్రాన్ని అన్ని మతాల ఆచారాలకు వర్తింపజేయడం సాధ్యం కాదని ధర్మాసనం పేర్కొంది. తొమ్మిదిమంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ కీలక అంశాలపై స్పష్టతనిచ్చింది. ఆర్టికల్ 25 ప్రకారం పౌరులకు ఉన్న మత స్వేచ్ఛను గౌరవిస్తూనే, అవసరమైన చోట సామాజిక సంస్కరణల కోసం ప్రభుత్వం జోక్యం ఏ మేరకు ఉండాలనేది న్యాయస్థానం నిశితంగా పరిశీలిస్తోంది. ప్రభుత్వ జోక్యంపై ముందస్తుగా గైడ్‌లైన్స్ జారీ చేయడం వల్ల భవిష్యత్తులో వచ్చే వివిధ కేసుల విచారణకు ఆటంకం కలిగే ప్రమాదం ఉందని ధర్మాసనం భావించింది. మతపరమైన హక్కులు 'రాజ్యాంగ నైతికత'కు లోబడి ఉండాలా లేదా అనే కీలక ప్రశ్నపై ఈ విచారణ కొనసాగుతోంది. ఏడో రోజు విచారణ ద్వారా సుప్రీంకోర్టు మతపరమైన విషయాల్లో న్యాయవ్యవస్థ, ప్రభుత్వ పరిధులను అత్యంత జాగ్రత్తగా విశ్లేషిస్తోంది. శబరిమల తీర్పును పున:సమీక్షించే క్రమంలో వెలువడే ఈ నిర్ణయాలు భారతదేశంలోని అన్ని మతాల ఆచార వ్యవహారాలపై సుదూర ప్రభావం చూపే అవకాశం ఉంది. తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనం తీసుకునే నిర్ణయం మతపరమైన హక్కుల విషయంలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలవనుంది.

# అక్షర యోధుడు.. ప్రజా గొంతుక

# అబ్దుల్ రహమాన్

## ‘ఉద్యమ కెరటం’ ఎడిటర్‌గా, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడిగా అలుపెరుగని పోరాటం





## కరోనా కష్టకాలంలో మానవత్వం చాటిన ‘ప్రజా జర్నలిస్టు’కు జన్మదిన శుభాకాంక్షలు

జర్నలిజం అంటే కేవలం సమాచారం చేరవేయడం మాత్రమే కాదు.. సమాజంలోని అన్యాయాలపై ఎక్కుపెట్టిన అక్షరాయుధం అని నమ్మి, తన వృత్తికి నిబద్ధతతో ప్రాణం పోస్తున్న వ్యక్తి అబ్దుల్ రహమాన్. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం (టీయూడబ్ల్యూజే) కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడిగా, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులుగా ఆయన అందిస్తున్న సేవలు నేటి యువ జర్నలిస్టులకు ఒక పాఠం. ఒకవైపు పత్రికా సంపాదకుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే, మరోవైపు సామాజిక సైనికుడిగా ఆయన సాగిస్తున్న ప్రయాణం అత్యంత స్ఫూర్తిదాయకం.

*- నేటి సాక్షి, హైదరాబాద్*








### సేవా పథంలో మానవత్వపు శిఖరం

అబ్దుల్ రహమాన్ కేవలం వార్తా గదులకే పరిమితం కాలేదు. ప్రపంచాన్ని వణికించిన కరోనా కష్టకాలంలో తన ప్రాణాలకు సైతం తెగించి ఆయన సామాజిక సేవలో నిమగ్నమయ్యారు. తన మిత్రులను ఒక సైన్యంగా మలిచి, మారుమూల గ్రామాలు, ఆదివాసీ గూడేలలో ఆకలితో అలమటించే వారికి నిత్యావసరాలు, మందులు పంపిణీ చేశారు. అపత్కాలంలో అండగా నిలిచిన ఆయన్ను చూసి ప్రజలు ‘ప్రజా జర్నలిస్టు’గా నీరాజనాలు పట్టారు.



### ‘ఉద్యమ కెరటం’లా నిరంతర చైతన్యం

తన పత్రిక పేరు ‘ఉద్యమ కెరటం’లో ఉన్న ఆ చైతన్యం అబ్దుల్ రహమాన్ వ్యక్తిత్వంలోనూ కనిపిస్తుంది. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం, వారి హక్కుల సాధన కోసం నిరంతరం శ్రమించే అరుదైన నాయకుడు ఆయన. జిల్లాలోని జర్నలిస్టులకు ఒక పెద్దన్నలా ఉంటూ, ఎవరికి ఏ కష్టం వచ్చినా ముందుండి పోరాడటం ఆయన నైజం. ముఖ్యంగా తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో క్షేత్రస్థాయిలో వార్తలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, ఉద్యమకారులను సమన్వయం చేయడంలో ఆయన పాత్ర అద్వితీయం.









### నిరంతర పోరాటమే ఊపిరిగా..

పర్యావరణ పరిరక్షణ నుంచి గిరిజన హక్కుల వరకు.. సామాజిక అన్యాయం ఎక్కడ జరిగినా అబ్దుల్ రహమాన్ గళం అక్కడ వినిపిస్తుంది. నిబద్ధత కలిగిన జర్నలిస్టుగా, నిస్వార్థమైన నాయకుడిగా అబ్దుల్ రహమాన్ గారు మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటూ, ‘నేటి సాక్షి’ తరపున ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.



నేటి సాక్షి
కరీంనగర్
గురువారం
23 ఏప్రిల్ 2026

## ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం లో వెంటనే చెయ్యాలి

**ఆర్టీసీ కార్మికుల జీవితాలతో ప్రభుత్వం ఆడుకోవద్దు.**



**నేటి సాక్షి, పరిగి.(సురేష్ మోత్కూర్):** పరిగి పట్టణంలో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె కార్యక్రమానికి మద్దతునిచ్చి సమ్మెలో పాల్గొన్న Brs పార్టీ ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.... ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీన ప్రక్రియ పూర్తి చేసి, రెండు PRC బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేసారు.రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు, సదుపాయాలను కల్పించాలని కోరారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ప్రారంభించిన, విలీన ప్రక్రియను ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఆపివేశారని, దానిని వెంటనే పూర్తి చేయాలని తెలియజేశారు.సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి కౌన్సిలర్లు, భాస్కర్, వారాల రవి, తాహెర్ అలీ, మీదిగడ్డ శ్రీనివాస్, ఆనం ఆంజనేయులు, శశాంక్ రెడ్డి, నరేష్ యాదవ్, నాయకులు సేవియా నాయక్, ఇక్బాల్, యువకులు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న పరిగి ఎమ్మెల్యే



**నేటి సాక్షి, పరిగి (సురేష్ మోత్కూర్):** గత పది రోజుల క్రితం పరిగి ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి కూతురు వివాహం ఘనంగా చేసారు. తాను అనుకున్న విధంగా పెళ్లి జరగటం, అన్ని వర్గాల నాయకులు, పార్టీలకతీతంగా అందరిని ఆహ్వానించారు. అందరు హాజరు అవ్వటం తనకు సంతోషాన్ని కలిగించింది అని కార్యకర్తలు చర్చించుకున్నట్టు సమాచారం. పరిగి ఎమ్మెల్యేగా తన బాధ్యత పూర్తి స్థాయిలో నిర్వహిస్తునని నమ్మకం తో, అందరికి అందుబాటులో ఉండటం తన నైజాం, ఈ సంతోషం లో తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామివారిని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి నూతన దంపతులు కుమార్తె శ్రీమతి మేఘన రెడ్డి – సంతోష్ రెడ్డి లతో కలిసి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ఈరోజు ఉదయం ఆలయంలో స్వామివారిని భక్తి శ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు.తాను ఎప్పుడు పరిగి ప్రజల సంక్షేమం కోసం పరితప్పించే వ్యక్తిగా, పరిగి ప్రాంతం బాగుండాలని కోరుకునే వ్యక్తి పరిగి మీాా రాంమోహన్ రెడ్డి అని పరిగి ప్రాంత వాసులు తెలుపుతుంటారు.

## గన్నేరువరం మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**గన్నేరువరం (నేటి సాక్షి - బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఘనంగా ప్రారంభించారు. గన్నేరువరం మండల కేంద్రంతో పాటు చొక్కారావు పల్లి, చాకలివాని పల్లె, మాదాపూర్, గోపాలపూర్ గ్రామాలలో ఐకేపి, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల వ్యవసాయ అధికారి (ఏవో) కిరణ్ మై, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముసుకు ఉపేందర్ రెడ్డి, గన్నేరువరం సర్పంచ్ రంగనవేని లక్ష్మీనరసు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోకుండా, ప్రభుత్వం కల్పించిన కనీస మద్దతు ధరకు ఈ కేంద్రాల్లో విక్రయించుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాతంగి అనిల్, బొడ్డు సునీల్, చింతల శ్రీధర్ రెడ్డి, బూర వెంకటేశ్వర్లు, నల్ల చంద్రారెడ్డి, బుర్ర మల్లేశం గౌడ్, నందికొండ తిరుపతిరెడ్డి, న్యాత జీవన్, పాకాల పరుశురాం, బొడ్డు బాలయ్య, రాజేశ్వరి, శివ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నిశాంత్ రెడ్డి



**నేటి సాక్షి, జగిత్యాల(గుండ ప్రశాంత్ గౌడ్):** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం దట్నూరు గ్రామంలో కోమల్ల సురేష్–మమత రిసెప్షన్ వాడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి దట్నూర్ గ్రామ సర్పంచ్ బెక్కం గంగారం ఉపసర్పంచ్ జక్కుల తిరుపతి నాయకులు రెవెల్ల సత్యనారాణ గౌడ్ కాసరపు ప్రవీణ్ మరియు తదితరులు

# ప్రజాసేవకు గుర్తింపుగా

## 'గుండోజి శ్రీను'కు గౌరవ వందనం

- కో ఆప్షన్ మెంబర్‌గా ఎన్నికైన గుండోజి శ్రీనివాస్‌కు ఘన సన్మానం
- విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అభినందనల వెల్లువ
- కోరుట్ల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షలు



**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలో గల విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ రోజు 27వ వార్డు మాజీ కౌన్సిలర్ గుండోజి శ్రీనివాస్ మున్సిపల్ కౌన్సిల్ కో ఆప్షన్ మెంబర్‌గా ఎన్నికైన శుభ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ప్రజాసేవా పథంలో నిరంతరం ముందుండే నాయకుడికి ఈ గౌరవం దక్కడం పట్ల సంఘ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ, ఆయన మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనల వెల్లువ కురిపించారు. గుండోజి శ్రీనివాస్ గతంలో 27వ వార్డు మాజీ కౌన్సిలర్‌గా ప్రజలకు అందించిన సేవలు, ప్రజల సమస్యలపై నిరంతరం స్పందించిన తీరు, సమాజ అభ్యున్నతికి చేసిన కృషికి గుర్తింపుగానే మున్సిపల్ కౌన్సిల్ కో ఆప్షన్ మెంబర్ పదవి దక్కిందని విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన సలహాదారులు ఈశ్వర వరప్రసాద్, గుండోజీ సత్య ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజల ఆశయాలకు అనుగుణంగా సేవలందిస్తూ కోరుట్ల పట్టణ అభివృద్ధిలో మరింత కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ప్రజా సేవలో అంకితభావంతో ముందుకు సాగుతున్న నాయకులకు సమాజం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వారు అన్నారు. కో ఆప్షన్ మెంబర్‌గా ఎన్నికైన గుండోజి శ్రీనివాస్ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కోరుట్ల పట్టణ అభివృద్ధికి కొత్త దిశగా అడుగులు వేయాలని పలువురు ఆకాంక్షించారు. పట్టణ సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి ప్రజల మన్ననలు పొందాలని ఆశీర్వదించారు. ఈ ఘన సన్మాన కార్యక్రమం కేవలం ఒక అభినందన సభ మాత్రమే కాకుండా, ప్రజాసేవలో మరింత బాధ్యతతో ముందుకు సాగాలని ఇచ్చిన ప్రేరణగా నిలిచింది. కోరుట్ల ప్రజల ఆశయాలను నెరవేర్చే నాయకుడిగా గుండోజి శ్రీనివాస్ మరింత గుర్తింపు పొందాలని సభలో పాల్గొన్నవారు హృదయపూర్వకంగా ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు మండలోజి పవన్, ఉపాధ్యక్షులు వనతడుపుల మారుతి, కత్తిరాజ్ శంకర్, ప్రధాన కార్యదర్శి వనతడుపుల సంజీవ్, కోశాధికారి గాండ్లోజీ శ్రీధర్, సహాయ కార్యదర్శి బెజ్జరాపు సత్యం పాల్గొని గుండోజి శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. అలాగే కార్యవర్గ సభ్యులు బెజ్జరాపు ప్రసాద్, ఎర్ర రంజిత్, ఇంద్రాల పవన్, పొలాస మనోజ్, గుండోజీ శేఖర్, పొలాస లక్ష్మీనారాయణ, గుండోజీ మనోహర్, గుండోజీ ప్రభాకర్‌తో పాటు యూత్ సభ్యులు వనతడుపుల కళ్యాణ్,



బెజ్జరాపు శరత్, బెజ్జరాపు రోహిత్, వనతడుపుల అరవింద్, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సంఘం ఐక్యత, నాయకత్వంపై నమ్మకం ఈ కార్యక్రమంలో స్పష్టంగా కనిపించింది.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



- కార్మికుల దీక్షకు మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్ సంఘీభావం

**నేటి సాక్షి,ఆసిఫాబాద్ (ఎండి ముబీన్):** ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద కార్మికులు చేపడుతున్న నిరవధిక నిరాహార దీక్షా శిబిరాన్ని వారు సందర్శించి, తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

**ప్రజలకు సేవ చేస్తున్న కార్మికులపై నిర్లక్ష్యం తగదు:**

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అహర్నిశలు ప్రజలకు రవాణా సేవలు అందిస్తున్న ఆర్టీసీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం జాప్యం చేయకూడదని పేర్కొన్నారు. ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్న కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోవాలని, వారి సమస్యలు పరిష్కారమయ్యే వరకు తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు చిలువేరు వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, సలం బీన్ అహ్మద్, మాజీ ఏఎంసీ సింగిల్ విండో చైర్మన్ గంధం శ్రీనివాస్, నాయకులు అలీ బీన్ అహ్మద్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సయ్యద్ నీసార్, దూడల అశోక్ తదితరులు పాల్గొన్నారు. కార్మికుల సమ్మెకు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు మద్దతు తెలపడంతో దీక్షా శిబిరం వద్ద సందడి నెలకొంది.

# గంగన్నా.. మీ మేలు మరువలేం



- భావోద్వేగానికి గురైన కాంగ్రెస్ శ్రేణులు
- కో-ఆప్షన్ మెంబర్‌గా గుండోజి శ్రీనివాస్ ఎన్నిక.. చైర్‌పర్సన్ వసంత-గంగాధర్ దంపతులకు ఘన సన్మానం

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ సరికొత్త ఉత్సాహంతో దూసుకుపోతోంది. ప్రజా సేవలో నిరంతరం ముందుండే 27వ వార్డు మాజీ కౌన్సిలర్ గుండోజి శ్రీనివాస్‌కు మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యత్వం దక్కడంతో పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ తిరుమల వసంత–గంగాధర్ దంపతులను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఘనంగా సన్మానించి, కృతజ్ఞతాభివందనం తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు వనతడుపుల శంకర వర ప్రసాద్ మాట్లాడుతూ.. శ్రీనివాస్ ఎన్నికకు సహకరించిన గంగాధర్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. "గంగన్నా.. మీ మేలు మరువలేం, మేమంతా ఒకే పార్టీ కుటుంబ సభ్యులం. ఒకరి గౌరవం అంటే అందరి గౌరవం" అని పేర్కొంటూ పార్టీ ఐక్యతను చాటిచెప్పారు. కోరుట్ల అభివృద్ధిలో తమ వంతు భాగస్వామ్యం ఉంటుందని స్పష్టం చేశారు. కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకూ బలోపేతం అవుతోందని నేతలు కొనియాడారు. కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపుతూ, ప్రజల్లో పార్టీపై విశ్వాసాన్ని పెంచడంలో ఆయన పాత్ర కీలకమని పేర్కొన్నారు. సన్మానం అనంతరం తిరుమల గంగాధర్ మాట్లాడుతూ.. శ్రీనివాస్ రెండు పర్యాయాలు కౌన్సిలర్‌గా గెలిచి నిరంతరం ప్రజల కోసమే పనిచేశారని, అందుకే ఆయనను ఈ పదవి వరించిందని అన్నారు. పార్టీ భేదాలు లేకుండా అందరూ కలిసి పనిచేస్తేనే కోరుట్ల పట్టణాన్ని అభివృద్ధి పథంలో నిలపవచ్చని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కో–ఆప్షన్ మెంబర్ గుండోజి శ్రీనివాస్, నాయకులు బొద్దూరి సతీష్ కుమార్, వనతడుపుల శంకర వరప్రసాద్, నాగేశ్వర వరప్రసాద్, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# ధోనీపై మారిన అభిప్రాయం

## సైనికుడిగా నిరూపించుకున్న కెప్టెన్ కూల్

ఎంఎస్ ధోనీ అంటే క్రికెట్ గుర్తుకు వస్తుంది. కానీ ఆయనలో దేశభక్తి కూడా అంతే గట్టిగా ఉందని మరోసారి స్పష్టమైంది. భారత ప్రాదేశిక సైన్యంలో గౌరవ లెఫ్టినెంట్ కల్నల్ హోదా పొందిన ధోనీ, ఆ పాత్రలోనూ తన నిబద్ధతను చాటుకున్నారు. ఈ హోదా ఇవ్వడంపై తొలినాళ్లలో కొంత వ్యతిరేకత ఉన్నట్లు రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ వినోద్ భాటియా వెల్లడించారు. ముఖ్యంగా 'మెరూన్ బెరెట్' వంటి ప్రతిష్టాత్మక గుర్తింపును సాధారణ వ్యక్తికి ఇవ్వడంపై సందేహాలు వ్యక్తం చేశానని తెలిపారు. పారాట్రూపర్ అవ్వాలంటే కఠినమైన శిక్షణ అవసరం ఉండగా, అలాంటి పరీక్షలు లేకుండా ఈ గౌరవం ఇవ్వడం సరికాదని అప్పట్లో భావించినట్లు చెప్పారు. అయితే, ధోనీ తన ప్రవర్తనతో ఆ అనుమానాలను పూర్తిగా చెదరగొట్టారని భాటియా పేర్కొన్నారు. 106 పారా టీఏ బెటాలియన్‌లో చేరిన ధోనీ, సాధారణ సైనికుడిలాగే క్రమశిక్షణతో వ్యవహరించడమే కాకుండా, 2015లో ఐదు పారాచూట్ జంప్‌లు పూర్తి చేసి 'పారా వింగ్' సాధించారు. ఎత్తుపై భయం ఉన్నప్పటికీ, దేశం కోసం ఆ భయాన్ని జయించి తన కర్తవ్యాన్ని నిర్వర్తించిన ధోనీపై భాటియా ప్రశంసలు కురిపించారు. జమ్మూ కశ్మీర్‌లో నియంత్రణ రేఖ వద్ద సైనికులతో కలిసి పనిచేసిన ఆయనలో నిజమైన సైనికుడి లక్షణాలు కనిపించాయని అన్నారు. దీంతో తొలినాళ్లలో ఉన్న తన అభిప్రాయం పూర్తిగా మారిందని భాటియా వెల్లడించారు.



# రాహుల్‌పై విమర్శల వర్షం..

## బ్యాటింగ్, కీపింగ్ రెండూ నిరాశ

ఐపీఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఆడుతున్న లోకేష్ రాహుల్ ప్రదర్శనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత సీజన్లలో మెరుగైన రికార్డులు కలిగిన ఈ స్టార్ బ్యాటర్, ఈసారి మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 243 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేధించే క్రమంలో రాహుల్ 23 బంతుల్లో 37 పరుగులకే పరిమితమయ్యాడు. స్ట్రైక్‌రేట్ బాగానే ఉన్నప్పటికీ, అవసరమైన సమయంలో దూకుడుగా ఆడకపోవడం జట్టుపై ప్రభావం చూపిందని విమర్శలు వస్తున్నాయి. అదే మ్యాచ్‌లో కీపింగ్‌లోనూ రాహుల్ తప్పిదాలు చేశాడు. కీలక సమయంలో అభిషేక్ శర్మను రన్ అవుట్ చేసే అవకాశం వదిలేయగా, ఆ తర్వాత అతడు భారీ స్కోర్ నమోదు చేయడం మ్యాచ్ మలుపు తిప్పింది. ఈ ప్రదర్శనతో సోషల్ మీడియాలో రాహుల్‌పై ట్రోల్స్ పెరిగాయి. అభిమానులు అతని ఆటతీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రా కూడా పెద్ద లక్ష్యాలను ఛేదించాలంటే పవర్‌ప్లేను సరిగ్గా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని సూచించాడు.

# సోనీ చేతికి ఆసియా క్రీడల ప్రసార హక్కులు

**ఢిల్లీ:** ఈ ఏడాది సెప్టెంబర్‌లో జపాన్ ఆతిథ్యమివ్వనున్న 20వ ఆసియా క్రీడల ప్రసార హక్కులను సోనీ పిక్చర్స్ దక్కించుకుంది. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 04 దాకా జరుగబోయే ఈ మెగా ఈవెంట్‌ను భారత్‌లో సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ చానెల్స్ ద్వారా వీక్షించొచ్చు. నిరుడు ఆసియా క్రీడల్లో రికార్డు స్థాయిలో 107 పతకాలు సాధించిన భారత్.. ఈసారి ఆ సంఖ్యను మరింత పెంచాలనే లక్ష్యంతో ఉంది.

# రాజస్థాన్ రాయల్స్ ఘన విజయం



## లక్నోపై 40 పరుగుల తేడాతో గెలుపు!

**రాణించిన రవీంద్ర జడేజా, జోఫ్రా ఆర్చర్**

**మిచెల్ మార్ష్ ఒంటరి పోరాటం వృథా**

**119 పరుగులకే కుప్పకూలిన లక్నో**

**ఎకానా బీ గ్రౌండ్‌లో ఆర్ఆర్ ఆధిపత్యం**





**లక్నో, ఏప్రిల్ 22 (మనసులో మాట):** ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా బుధవారం ఎకానా క్రికెట్ స్టేడియం బీ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ అద్భుత విజయం సాధించింది. సొంత మైదానంలో లక్నో సూపర్ జెయింట్స్ జట్టును 40 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసింది. బౌలింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై రాజస్థాన్ ఆల్ రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. టాస్ గెలిచిన లక్నో కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకోగా.. రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. ఆ తర్వాత లక్ష్య ఛేదనలో లక్నో బ్యాటర్లు తడబడటంతో ఆ జట్టు 18 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌట్ అయింది.



### జడేజా బాధ్యతాయుత ఇన్నింగ్స్

ముందుగా బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ జట్టుకు ఓపెనర్ యశస్వి జైస్వాల్ (12 బంతుల్లో 22 పరుగులు) మెరుపు శుభారంభం ఇచ్చాడు. స్వల్ప వ్యవధిలోనే వికెట్లు పడుతున్న దశలో ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఆఖరి వరకు అజేయంగా క్రీజులో నిలిచిన జడేజా 29 బంతుల్లో 43 పరుగులు చేసి జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించాడు. అతనికి తోడుగా షిమ్రాన్ హెట్మెయిర్ (18 బంతుల్లో 22 పరుగులు) విలువైన పరుగులు సాధించాడు. లక్నో బౌలర్లలో మోసిన్ ఖాన్ అద్భుతంగా బౌలింగ్ చేసి 4 ఓవర్లలో కేవలం 17 పరుగులు ఇచ్చి 2 వికెట్లు పడగొట్టాడు. యువ బౌలర్ ప్రిన్స్ యాదవ్ 29 పరుగులకు 2 వికెట్లు తీయగా.. వెటరన్ పేసర్ మహమ్మద్ షమీ 30 పరుగులిచ్చి 2 వికెట్లు దక్కించుకున్నాడు.

### కట్టడి చేసిన ఆర్ఆర్ బౌలర్లు.. మార్ష్ పోరాటం వృథా

160 పరుగుల లక్ష్య ఛేదనలో లక్నో సూపర్ జెయింట్స్ ఏ దశలోనూ విజయం దిశగా సాగలేదు. రాజస్థాన్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ ముందు లక్నో బ్యాటర్లు విలవిలలాడారు. ఆసీస్ ఆల్ రౌండర్ మిచెల్ మార్ష్ (41 బంతుల్లో 5 5 పరుగులు) హాఫ్ సెంచరీతో ఒంటరి పోరాటం చేసినా అతనికి మిగతా బ్యాటర్ల నుంచి కనీస సహకారం లభించలేదు. నికోలస్ పూరన్ 25 బంతుల్లో 22 పరుగులు చేసి నిరాశపరిచాడు. హిమ్మత్ సింగ్ (15 బంతుల్లో 15 పరుగులు) తక్కువ స్కోరుకే వెనుతిరిగాడు. రాజస్థాన్ బౌలర్లలో ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ లక్నో బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బతీశాడు. 4 ఓవర్లలో 20 పరుగులు మాత్రమే ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. నాంద్రే బర్గర్ 4 ఓవర్లలో 27 పరుగులిచ్చి 2 వికెట్లు తన ఖాతాలో వేసుకోగా.. బ్రిజేష్ శర్మ 3 ఓవర్లలో 18 పరుగులిచ్చి 2 వికెట్లు తీసి లక్నో పతనాన్ని శాసించారు.





# మా సక్సెస్‌కు కారణం అదే: ఇషాన్ కిషన్

ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ వం-సగా మూడో విజయంతో జోరును కొనసాగిస్తోంది. ఉప్పల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై 47 పరుగుల తేడాతో గెలిచిన ఈ జట్టు, పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేరింది. ఇప్పటివరకు 7 మ్యాచ్‌లలో నాలుగు విజయాలు నమోదు చేసింది. విజయం అనంతరం కెప్టెన్ ఇషాన్ కిషన్ మాట్లాడుతూ, తమ జట్టు విజయానికి సరళమైన వ్యూహమే కారణమని వెల్లడించాడు. ఒక్కో మ్యాచ్‌ను ప్రత్యేకంగా తీసుకుంటూ, పరిస్థితులకు అనుగుణంగా ఆడటమే తమ బలం అని చెప్పాడు. అభిషేక్ శర్మ ఇన్నింగ్స్, చివర్లో హెన్రిచ్ క్లాసెన్ ఫినిషింగ్ జట్టుకు పెద్ద ప్లస్ అయ్యాయని పేర్కొన్నాడు. పిచ్‌ను అర్థం చేసుకున్న తర్వాత దూకుడుగా ఆడటమే తమ విధానం అని వివరించాడు. బౌలింగ్‌లోనూ కీలక సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం కలిసి వచ్చిందని, ఆటను ఆస్వాదిస్తూ ఆడమనే సందేశమే జట్టును ముందుకు నడిపిస్తోందని ఇషాన్ తెలిపాడు.





# ఐసీసీ నుంచి వైదొలిగిన పీసీబీ మాజీ సీఈవో

పాకిస్థాన్ మాజీ సీఈవో వాసిమ్ ఖాన్ అంతర్జాతీయ క్రికెట్ కమిటీ నుంచి వైదొలిగారు. ఐసీసీ జనరల్ మేనేజర్ పదవికి గుడ్‌బై చెప్పేశారు. నాలుగేళ్లపాటు ఆ బాధ్యతలు నిర్వర్తించిన ఆయన పదవిని వీడారు. జెఫ్ అల్లార్డైస్ నుంచి 2022లో వాసిమ్ ఖాన్ బాధ్యతలను స్వీకరించారు. అంతకుముందు ఆయన పీసీబీ సీఈవోగా మూడేళ్లు పనిచేశారు. ఇప్పుడు వైదొలిగినా.. మరో పదవీ బాధ్యతలను తీసుకొనే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు తెలిపాయి.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI





# శ్రీలీల మళ్లీ గాడిలో పడేనా?

టాలీవుడ్ యంగ్ బ్యూటీ శ్రీలీల మరోసారి తన లేటెస్ట్ ఫోటోషూట్‌తో అభిమానులను ఆకట్టుకుంది. ఐవరీ అనార్కలి డ్రెస్సులో గోల్డ్ ఎంబ్రాయిడరీతో ఆమె కనిపించిన తీరు ఎలిగెన్స్‌కు నిదర్శనంగా నిలిచింది. సింపుల్ లుక్‌లోనే ఆకర్షణీయంగా మెరిసి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే సినిమాల విషయానికి వస్తే, ఇటీవల వచ్చిన 'రాబిన్‌హుడ్', 'జూనియర్', 'ఉస్తాద్ భగత్ సింగ్' ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయాయి. ముఖ్యంగా ఆమె పాత్రలకు సరైన ప్రాధాన్యం లేకపోవడం విమర్శలకు కారణమైంది. ఇప్పటికీ గ్లామర్, డ్యాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో మంచి క్రేజ్ ఉన్న శ్రీలీల, సరైన కథలు ఎంపిక చేసుకుంటే మళ్లీ హిట్ ట్రాక్‌లోకి రావడం కష్టమేమీ కాదని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి.

# చిరుతో బాబీ సినిమా

## నెగెటివ్ రోల్‌లో డింపుల్ హయతి

టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద 'వాల్తేరు వీరయ్య'తో మ్యాజిక్ చేసిన మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబీ కొల్లి మళ్ళీ చేతులు కలిపారు. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులను ముగించుకుని షూటింగ్‌కు సిద్ధమవుతోంది. ఇప్పటికే మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, బాలీవుడ్ నటుడు అనురాగ్ కశ్యప్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. ఇక ఈ సినిమాలో చిరు సరసన ప్రియమణి హీరోయిన్‌గా నటించే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా, ఈ చిత్రానికి సంబంధించి తాజాగా వినిపిస్తున్న ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ సినిమాలో ఒక కీలక పాత్ర కోసం బోల్డ్ బ్యూటీ డింపుల్ హయాతిని ఎంపిక చేసినట్లు సమాచారం. సాధారణంగా డింపుల్ హయాతి అంటే గ్లామర్ పాత్రలకు కేరాఫ్ అడ్రస్. కానీ బాబీ ఈ సినిమాలో ఆమెను సరికొత్తగా చూపించబోతున్నారట. ఇందులో ఆమె హీరోయిన్ కాదు అని, నెగిటివ్ షేడ్స్ ఉన్న ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తుందని తెలుస్తోంది. మెగాస్టార్ వంటి దిగ్గజ నటుడికి ఎదురు నిలిచే పాత్ర కావడంతో డింపుల్ రోల్ చాలా ఇంటెన్సివ్‌గా ఉండబోతోందట. ఈ డిఫరెంట్ కాస్టింగ్ సినిమాకు పెద్ద ప్లస్ అవుతుందని ఫిలిం నగర్ వర్గాలు భావిస్తున్నాయి. కమెగాస్టార్ ఒక సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నారని, బాబీ ఈ పాత్రను చాలా స్టైలిష్‌గా డిజైన్ చేశారని టాక్.






# 'కాక్‌టెయిల్ 2'లో కృతి అందాల అరాచకం

బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ 'కాక్‌టెయిల్ 2'లో తన స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకుంటోంది. హోమీ అదజానియా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం జూన్ 19, 2026న విడుదల కానుంది. ఇందులో షాహిద్ కపూర్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా కృతి షేర్ చేసిన ఫోటోల్లో బోహో స్టైల్ ఫ్లోరల్ డ్రెస్‌లో ఆమె గ్లామర్ హైలెట్ అయింది. సముద్రం నేపథ్యంగా తీసిన ఈ లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. స్టార్ కాస్ట్, రొమాంటిక్ కథతో 'కాక్‌టెయిల్ 2'పై ఇప్పటికే మంచి క్రేజ్ ఏర్పడింది.


# కొత్త గృహంలోకి ప్రవేశించనున్న బన్నీ

## జూబ్లీహిల్స్‌లో ఖరీదైన ఇంటి నిర్మాణం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పాన్ ఇండియా స్థాయిలో తన క్రేజ్‌ను రోజు రోజుకు పెంచుకుంటూ, సంపాదనలోనూ కొత్త రికార్డులు సృష్టిస్తున్నారు. 'పుష్ప' సినిమాతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఆయన, సినిమాల ద్వారా మాత్రమే కాకుండా బ్రాండ్ ఎండార్స్‌మెంట్లు, భారీ రెమ్యునరేషన్లతో టాలీవుడ్‌లో అత్యధిక ఆదాయం పొందుతున్న నటులలో ఒకరిగా నిలిచారు. ఈ విజయాలకి తగ్గట్టుగానే ఆయన జీవనశైలిని కూడా విలాసవంతంగా తీర్చిదిద్దుకుంటున్నారు. ఇప్పటికే సినీ రంగంలోనే కాకుండా వ్యాపార రంగంలో కూడా అడుగుపెట్టిన బన్నీ, 'అల్లు స్టూడియోస్' నిర్మాణంతో తన విజన్‌ను చూపించారు. ఇప్పుడు అదే స్థాయిలో తన వ్యక్తిగత జీవితంలో కూడా ఓ భారీ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన ప్రాంతమైన జూబ్లీహిల్స్‌లో ఆయన నిర్మిస్తున్న కొత్త మేన్షన్ ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ లగ్జరీ హౌస్ సుమారు 4 వేల చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మితమవుతోంది. అత్యాధునిక సదు-పాయాలు, ప్రీమియం ఇంటీరియర్స్, ప్రత్యేక డిజైన్‌లతో ఈ ఇంటిని అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యంగా ఈ మేన్షన్ నిర్మాణానికి దాదాపు రూ.80 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఇది పూర్తయితే జూబ్లీహిల్స్‌లోనే అత్యంత ఖరీదైన మరియు స్టైలిష్ ఇళ్లలో ఒకటిగా నిలవనుంది. ఈ మేన్షన్ మరో ప్రత్యేకత ఏమిటంటే, ఇది మెగాస్టార్ చిరంజీవి నివాసానికి సమీపంలోనే ఉండటం. సినీ కుటుంబం మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబించేలా ఈ ఇంటి లొకేషన్ కూడా ప్రత్యేక ఆకర్షణగా మారింది. ప్రస్తుతం ఈ నిర్మాణం తుదిదశకు చేరుకోగా, ఈ ఏడాది చివర్లో అల్లు అర్జున్ తన కుటుంబంతో కలిసి గృహప్రవేశం చేయనున్నట్లు తెలుస్తోంది. అల్లు అర్జున్ నిర్మిస్తున్న ఈ కొత్త మేన్షన్ కేవలం ఒక ఇల్లు మాత్రమే కాదు.. ఆయన సాధించిన విజయాలకు ప్రతీకగా నిలిచే ఒక ల్యాండ్‌మార్క్‌గా మారబోతోందని అభిమానులు భావిస్తున్నారు.









# నాభి అందాలతో నషా ఎక్కిస్తున్న అదితి గౌతమ్

## క్రేజీ పోజులకు నెటిజన్స్ మైండ్ బ్లాక్

అదితి గౌతమ్ తన లేటెస్ట్ బోల్డ్ ఫోటోషూట్‌తో కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తోంది. తన నాభి అందాలను ఎరగా వేస్తూ, నషా ఎక్కించే కిల్లర్ పోజులతో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఈ గ్లామరస్ ట్రీట్‌కు నెటిజన్లు క్లీన్ బౌల్డ్ అవుతూ, ఆమె హాట్ అండ్ సెన్సేషనల్ లుక్స్‌ను వైరల్ చేస్తున్నారు! తాజా ఫోటోలలో ఆమె ట్రెండీ అవుట్‌ఫిట్‌లో కనిపిస్తూ, ధైర్యమైన పోజులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె లుక్, ప్రెజెన్స్ నెటిజన్లను ఆకట్టుకుని, ఫోటోలు వైరల్ అవుతున్నాయి. అదితి గౌతమ్ ఈ ఫోటోషూట్ ద్వారా మరోసారి తన గ్లామర్ ఇమేజ్‌ను బలంగా ప్రదర్శించిందని చెప్పవచ్చు.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**



# గడిబురుజుల రక్షణ పోరాటం ఉధృతం



- రెండవ రోజు నిరసన దీక్షకు విస్తృత మద్దతు - అన్ని పార్టీల నేతలు సంఘీభావం
- వి. ఎల్. టీ లను వెంటనే రద్దు చేయాలంటూ అఖిలపక్ష ప్రజాసంఘాల డిమాండ్
- కాంగ్రెస్ పార్టీ మౌనంపై అనుమానాలౌస్పందించాలని విపక్షాల ప్రశ్నలు
- గడిబురుజుల భూములు ప్రజల సామూహిక ఆస్తి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలన్న నాయకులు

**నేటి సాక్షి,కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలో చారిత్రాత్మక ప్రాధాన్యత కలిగిన గడిబురుజుల (గ్రామకంఠ / ఆబాది) ఖాళీ స్థలాల పరిరక్షణ కోసం అఖిలపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రారంభమైన నిరసన ఉద్యమం రోజురోజుకూ ఉధృతమవుతోంది. రెండవ రోజు బుధవారం నిర్వహించిన నిరసన దీక్షకు వివిధ రాజకీయ పార్టీల నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి సంఘీభావం ప్రకటించారు. ఈ భూములపై విధించిన విఎల్టీలను వెంటనే రద్దు చేయాలని, అవినీతికి పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉద్యమకారులు తమ స్వరాన్ని మరింత బలంగా వినిపించారు.

### ఉద్యమానికి అన్ని వర్గాల మద్దతు పెరుగుతోంది

రెండవ రోజు దీక్షకు బిఆర్ఎస్ పార్టీకి చెందిన 19వ వార్డు కౌన్సిలర్ ఎండి మోసిన్, 16వ వార్డు కౌన్సిలర్ పొట్ట సురేందర్, 30వ వార్డు మాజీ కౌన్సిలర్లు ఎండి ముజఫర్ అహ్మద్ సజ్జు, సయ్యద్ అన్వర్ హాజరై తమ పూర్తి మద్దతు ప్రకటించారు. కేవలం సంఘీభావం తెలపడం మాత్రమే కాకుండా ఉద్యమంలో నేరుగా పాల్గొంటామని స్పష్టం చేశారు.అంతకుముందే బీజేపీ నాయకులు కూడా మద్దతు ప్రకటించడంతో ఈ ఉద్యమానికి అన్ని వర్గాల నుంచి మద్దతు పెరుగుతోంది. ప్రజా సమస్యపై రాజకీయాలకు అతీతంగా ఐక్యత ప్రదర్శించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### కాంగ్రెస్ పార్టీ మౌనంపై విపక్షాల ప్రశ్నలు

గడిబురుజుల స్థలాల అంశంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు గొంతు విప్పకపోవడంపై బిఆర్ఎస్ నాయకులు అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రజల భూముల పరిరక్షణ విషయంలో అధికారపక్షం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ స్పందించి విఎల్టీలను రద్దు చేయించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ వ్యాఖ్యలు ఉద్యమానికి మరింత రాజకీయ ప్రాధాన్యతను తెచ్చిపెట్టాయి. ప్రజల్లో కూడా అధికారపక్ష వైఖరిపై చర్చ జరుగుతోంది.

### 'గడిబురుజుల భూములు ప్రజల సామూహిక ఆస్తి'

ఈ సందర్భంగా అఖిలపక్ష ప్రజాసంఘాల ఐక్యవేదిక గౌరవ అధ్యక్షులు చెన్న విశ్వనాథం, కన్వీనర్ మొహమ్మద్ ముజాహిద్, ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్ మాట్లాడుతూ.. గడిబురుజుల భూములు ప్రజల సామూహిక ఆస్తి అని స్పష్టం చేశారు. వాటిని అక్రమాలకు గురికాకుండా కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.చారిత్రాత్మకంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా ఈ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యతను కాపాడాలని అన్నారు. ప్రజల కోసం ఉన్న భూములను కొందరి స్వార్థ ప్రయోజనాలకు వదిలేయబోమని హెచ్చరించారు.

### చారిత్రాత్మక ప్రదేశాల సంరక్షణకు డిమాండ్

గడిబురుజుల చారిత్రాత్మక నిర్మాణాలను కాపాడాలని, కోనేరును సంరక్షించాలని, మైసమ్మ తల్లికి దేవాలయం నిర్మించాలని నాయకులు డిమాండ్ చేశారు. అలాగే ఆ ప్రాంతంలో కూరగాయల మార్కెట్, ప్రజలకు ఉపయోగపడే పార్క్ ఏర్పాటు చేయాలని కోరారు.మహిషాసుర మర్దిని ఉత్సవాలు జరుగుతున్న స్థలాన్ని యధాతథంగా కొనసాగించాలని, ఆ ప్రాంతం ప్రజల ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రంగా కొనసాగాలని పేర్కొన్నారు.

### విఎల్టీలు రద్దయ్యే వరకు పోరాటం కొనసాగుతుంది

గడిబురుజుల భూములపై విధించిన విఎల్టీలు పూర్తిగా రద్దు అయ్యే వరకు ఈ ఉద్యమం ఆగదని అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు హెచ్చరించారు. సమస్య పరిష్కారం కోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజలు ఏకమై ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ పోరాటం కేవలం భూముల కోసమే కాదనొ చరిత్ర, సంస్కృతి, ప్రజా హక్కుల పరిరక్షణ కోసం జరుగుతోందని స్పష్టం చేశారు.రోజురోజుకూ ఉద్యమానికి ప్రజా మద్దతు పెరుగుతుండటంతో గడిబురుజుల భూముల పరిరక్షణ పోరాటం కోరుట్లలో కీలక మలుపు తిరుగుతున్నట్లు కనిపిస్తోంది. 'గడిబురుజులు కాపాడాలి విఎల్టీలు రద్దు చేయాల'నే నినాదాలతో నిరసన దీక్ష ప్రాంగణం మార్మోగింది.ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ప్రజాసంఘాల కో-కన్వీనర్లు తుమ్మనపల్లి శ్రీనివాస్ బాబు, సుతారి రాములు, సయ్యద్ అన్వర్, ఎం.ఏ. ముజీబుర్ రహ్మాన్, చింతా భూమేశ్వర్, కుంచెం శంకర్, షాహెద్ మహ్మద్ షేక్, ఎన్. గంగాధర్, జక్కుల శంకర్, గణేష్, ఎం. రాజయ్య, షేక్ సిరాజ్, ఎండి అన్వర్ తదితరులు పాల్గొన్నారు.



# మల్లికార్జున ఖర్గే దిష్టిబొమ్మ దహనం

- ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కోరుట్ల బీజేపీ పట్టణ శాఖ ఆందోళన
- ఇకపై బీజేపీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని హెచ్చరిక




**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ఏఐసీసీ జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కోరుట్ల భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు చేపట్టిన ఈ ఆందోళనలో భాగంగా ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని కాంగ్రెస్ పార్టీ వైఖరిని తీవ్రంగా విమర్శించారు. కోరుట్ల పట్టణ బీజేపీ అధ్యక్షుడు కస్తూరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీని తీవ్రవాది అంటూ అనుచితంగా వ్యాఖ్యానించడం అత్యంత దురదృష్టకరమని మండిపడ్డారు. దేశ ప్రజల విశ్వాసంతో మూడోసారి ప్రధానమంత్రి అయిన నాయకుడిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ పార్టీ అహంకారానికి నిదర్శనమని అన్నారు.ఖర్గే వయసు ఎక్కువ కావడంతో మతిభ్రమించి నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం వెంటనే స్పందించి ఆయనను మంచి ఆసుపత్రిలో చూపించి, ఏఐసీసీ అధ్యక్ష పదవి నుంచి తప్పించాలని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. దేశ ప్రయోజనాల కోసం పనిచేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై అవమానకర వ్యాఖ్యలు చేయడం ప్రజలు సహించరని హెచ్చరించారు. ఇక పైనా భారతీయ జనతా పార్టీ గురించి కానీ, పార్టీ నాయకుల గురించి కానీ ఎవరైనా నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోబోమని బీజేపీ నాయకులు హెచ్చరించారు. అవసరమైతే కాంగ్రెస్ నాయకుల ఇళ్ల ముందు కూడా ఇలాంటి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.ఈ వ్యాఖ్యలతో కార్యక్రమం ఉద్రిక్తంగా మారగా, బీజేపీ కార్యకర్తలు నినాదాలతో ప్రాంతాన్ని హోరెత్తించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ బీజేపీ కౌన్సిలర్లు కలాల రాధ సాయిచంద్, సోరుపాక రమాదేవి రమేష్, గుగ్లావత్ శ్రీకాంత్, తిరుమల వాసు,పట్టణ ప్రధాన కార్యదర్శులు ఎర్ర రాజేందర్, గిన్నెల శ్రీకాంత్, మాడవేణి నరేష్, పోతుగంటి శ్రీనివాస్, నేమూరి విజయ్, సాడిగే మహేష్, రాధారపు సత్యనారాయణ, మ్యాకల గణేష్, ఇర్నాల స్వామి, మామిడి మల్లేష్, బాల్క ప్రేమ్ కుమార్,జగిత్యాల జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు తుక్కారం గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు పంచారి విజయ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి రాజు, మండల నాయకులు ఉంద్ర విజయ్, బోలిశెట్టి రాజేందర్‌తో పాటు మండల కార్యవర్గ సభ్యులు, పట్టణ బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# యంనోనిపల్లిలో శ్రీ ఎల్లమ్మ బండారు కార్యక్రమం

### గోటూరు కులస్తుల ఆధ్వర్యంలో వేడుకలు.



**నేటి సాక్షి,నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని యంనోనిపల్లి గ్రామంలో బుధవారం శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ దేవత బండారు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది. గోటూరు కులస్తుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గ్రామానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా ఆచార సంప్రదాయాల ప్రకారం దేవత బండారు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సుమారు 33 కుటుంబాలపై బండారును చల్లారు. గ్రామమంతా భక్తి భావంతో పునీతమైంది. అమ్మవారి కృపాకటాక్షాలు గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సచిన్, మాజీ ఎంపీటీసీ గౌని శ్రీనివాస్, కుర్వ గౌడ్ సిద్ధప్ప, ఆలయ పూజారి మల్లప్ప పాల్గొన్నారు. వారితో పాటు కాశీనాథ్ రెడ్డి, కూర్మయ్య, అశోక్, శ్రీనివాస్, రాములు, సిద్ధప్ప, రాజు, బీరప్ప తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



**నేటిసాక్షి,నల్లబెల్లి:** మండలంలోని కొండాపూర్ గ్రామంలోని ఎంపీ యుపిఎస్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవంబుధవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే .శ్రీనివాస రాజు గారు అధ్యక్షత వహించగా ఉపాధ్యాయుల బానోతు కృష్ణ, కందకట్ల నాగరాజు, మా లోతు వెంకటేశ్వర్లు, వేము ప్రవీణ్, అనిత , మనోజ గ్రామ సర్పంచ్ అబ్బురబోయిన లలిత సురేష్, సెక్రటరీ పృథ్వి, కల్తీ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గ్రాడ్యుయేషన్ డే




**నేటిసాక్షి, నల్లబెల్లి:** మండలంలోని రంగాపురం ఎంపీపీ ఎస్ పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డేను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి అనురాధ పాల్గొని విద్యార్థులకు పట్టాలు ప్రధానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నాణ్యత గల గుణాత్మక విద్య, సామర్థ్యాల వారి బోధన కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే లభిస్తుందని అనుభవం గల ఉపాధ్యాయులు పటిష్టమైన పర్యవేక్షణ గల మేనేజ్మెంట్ ప్రభుత్వ పాఠశాలల్లో ఉంతుందన్నారు.ప్రైవేట్ సెక్టార్ లో నిర్వహించే గ్రాడ్యుయేషన్ డే ను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నిర్వహించడం ఆనంద దాయకమని విద్యార్థులలో నేర్చుకోవాలని కుతూహలంను పెంపొందిస్తుందని ఉన్నత చదువులకు రాచబాటగా నిలుస్తుందన్నారు.గ్రామ సర్పంచ్ ఓరుగంటి మాధురి రాజు మాజీ సర్పంచ్ చీకటి ప్రకాష్ మాట్లాడుతూ... రంగాపురం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచేందుకు ఉపాధ్యాయులకు తమవంతు సహకారం అందిస్తామని ఇలాంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులకు నేర్చుకోవాలని ఆలోచన ప్రేరణ కలిగి వారు జీవితంలో ఉత్తమ పౌరులుగా ఎదగడానికి ప్రభుత్వ పాఠశాలలు దారి చూపిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి, స్వరాజ్యం, చందన, సహారా, విద్యావంతుల వేదిక అధ్యక్షులు పట్టు సాంబయ్య, గ్రామ వార్డు సభ్యులు శ్రీహరి, సతీష్, సిఆర్పి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

### ఇస్రాజ్ పల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి అడ్లూరి.



**నేటి సాక్షి, జగిత్యాల (గుండ ప్రశాంత్ గౌడ్):** ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం గొల్లపల్లి మండలం ఇస్రాజ్‌పల్లె గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర అందించాలని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని మంత్రి అన్నారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో తప్ప తాలు పేరుతో క్వింటాల్ కు నాలుగు నుంచి ఐదు కిలోల వరకు కోతల విధించేవారని మంత్రి అన్నారు. మధ్యవర్తుల దోపిడీ లేకుండా రైతులకు నేరుగా లాభం చేకూరే విధంగా కొనుగోలు కేంద్రాల్లో చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్,వైస్ చైర్మన్ రాజిరెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నిశాంత్ రెడ్డి మాజీ సర్పంచ్ లు సత్యనారాయణ గౌడ్ చిర్ర గంగాధర్ మాజీ ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్ మరియు రవి ప్రవీణ్ గౌడ్ ఇస్రాజ్ పల్లి యూత్ సభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# కోరుట్ల మున్సిపాలిటీలో బీజేపీ ఫ్లోర్ లీడర్‌ల నియామకం



**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతం అయ్యే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అధికారికంగా ప్రకటించారు. ఈమేరకు కోరుట్ల మున్సిపాలిటీలో పార్టీ తరపున ఎన్నికైన వార్డు సభ్యులకు కీలక బాధ్యతలను అప్పగిస్తూ ప్రెస్ నోట్ విడుదల చేశారు. కోరుట్ల మున్సిపాలిటీలో బీజేపీ తరపున ఫ్లోర్ లీడర్‌గా రుద్ర సుజాతను నియమించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో పార్టీ అభిప్రాయాలను బలంగా వినిపిస్తూ, ప్రజా సమస్యలపై పోరాటం చేయాల్సిన బాధ్యత ఆమెపై ఉండనుంది. డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా తిరుమల వాసును నియమించారు. ఫ్లోర్ లీడర్‌కు సహకరిస్తూ పార్టీ నిర్ణయాలను అమలు చేయడం, కౌన్సిలర్ల మధ్య సమన్వయం చేయడం ఆయన ప్రధాన బాధ్యతగా ఉండనుంది. ఫ్లోర్ సెక్రటరీగా గుగ్లావత్ శ్రీకాంత్‌కు బాధ్యతలు అప్పగించారు. మున్సిపల్ సమావేశాలకు సంబంధించిన అంశాల సమన్వయం, పార్టీ కార్యాచరణను వ్యవస్థీకృతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించనున్నారు. పార్టీ విప్‌గా రాధా సాయిచంద్‌ను నియమించారు. కౌన్సిల్ సమావేశాల్లో పార్టీ నిర్ణయాలకు అనుగుణంగా సభ్యులు వ్యవహరించేలా పర్యవేక్షించడం ఆయన బాధ్యతగా ఉంటుంది. ఈ మేరకు జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపాలిటీ కమిషనర్‌కు అధికారికంగా సమాచారం అందజేస్తూ, అన్ని అధికారిక కార్యక్రమాల్లో ఈ పేర్లను నమోదు చేయాలని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు కోరారు. కోరుట్ల మున్సిపాలిటీలో బీజేపీ బలోపేతానికి ఈ నియామకాలు కీలక మలుపుగా మారనున్నాయని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. కోరుట్ల మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గా రుద్ర సుజాత, పార్టీ విప్పు గా కలాల రాధాసాయి చంద్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఇందూరి తిరుమల వాసు, సెక్రటరీ గా గూగులోతి శ్రీకాంత్ ను నియామించినట్లు భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్ష్యులు రాంచంద్రరావు తెలిపారు. ఇట్టి నియమకానికి సహకరిశీచినా రాష్ట్ర అధ్యక్ష్యులు రాంచంద్ర రావుకి, ఎంపీ. ధర్మపురి అర్వింద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్. అనూప్ రావు , జిల్లా అధ్యక్ష్యులు డాక్టర్ యాదగిరి బాబు, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్ర శ్రీనివాస్ ,కోరుట్ల బీజేపీ పట్టణ అధ్యక్షులులు కస్తూరి లక్ష్మి నారాయణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేశారు. నూతనంగా నియమింపబడ్డవారికి డాక్టర్. అనూప్ రావు శాలువాతో సత్కారిశీచారు.

# ఘనంగా ధరిత్రి దినోత్సవం



**నేటి సాక్షి, చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎమ్మార్వోకు. మొక్కల పంపిణీ చేస్తున్న పర్యావరణ ఉద్యమ వేత్త కొల్లు లక్ష్మీనారాయణ చిలుకూరు మండల పరిషత్ తాసిల్దార్ కార్యాలయాల వద్ద బుధవారం ధరిత్రి దినోత్సవంజూ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కల పెంపకం చేపట్టి వాటిని పరిరక్షించాలని అన్నారు కార్యాలయం వద్ద మొక్కలు నాటారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ధ్రువ కుమార్ ఎంపీడీవో ముక్కపాటి నరసింహారావు ఏపీవో నిర్మల ఈవో మృత్యుంజయ శాస్త్రి సిరికొండ అనంత ఇష్టమాచార్యులు గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# చిలుకూరులో కబడ్డీ పోటీలు



**నేటి సాక్షి చిలుకూరు:** కరపత్ర ఆవిష్కరించిన కత్రం ఫౌండేషన్ సభ్యులు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలో కత్రం ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఈనెల 24 25 తేదీల్లో రెండు రోజులపాటు మండల స్థాయి కబడ్డీ పోటీల ను విజయవంతం చేయాలని కోరుతూ సంబంధిత కరపత్రం ఫౌండేషన్ సభ్యులు ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిలుకూరులో జిల్లా పరిషత్ పాఠశాలలో మండల శాఖ బడ్డీ పోటీలను విజయవంతం చేయాలని అన్నారు ఈ పోటీలకు ఆసక్తి గల క్రీడాకారులు వారి పేరును నమోదు చేసుకోవాలని కోరారు కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలని అన్నారు ఈ నెల రెండో తేదీన కోదాడలో 5కే రన్ వాక్ ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో కోదాడ ప్రాంతవాసులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కత్రం ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

# కథలాపూర్‌లో మల్లికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మ దగ్ధం

- ప్రధాని మోదీపై వివాదాస్పద వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ శ్రేణుల ఆగ్రహం



**కథలాపూర్ (నేటి సాక్షి - రాధారపు నర్సయ్య):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కథలాపూర్ మండల భారతీయ జనతా పార్టీ నాయకులు బుధవారం రోడ్డెక్కారు. మండల అధ్యక్షుడు మల్యాల మారుతి ఆధ్వర్యంలో ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో కథలాపూర్ పురవీధులు మార్మోగాయి. చెన్నైలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని మోదీని ఉద్దేశించి ఖర్గే 'పొలిటికల్ టెర్రరిస్ట్' అని వ్యాఖ్యానించడంపై బీజేపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ ప్రధానిని ఉగ్రవాదితో పోల్చడం ఖర్గే బాధ్యతారాహిత్యానికి, కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. ప్రపంచ దేశాల్లో భారత్ కీర్తిని పెంచుతున్న ప్రధానిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దేశాన్ని అవమానించడమేనని విమర్శించారు. మండల అధ్యక్షుడు మల్యాల మారుతి మాట్లాడుతూ.. ఖర్గే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని వెంటనే దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ నాయకులను అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత దూషణలకు తావులేదని, రాజకీయ లబ్ధి కోసం దేశ ప్రధానిని కించపరచడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నరెడ్ల రవి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కథలాపూర్ మహేష్, ఉపాధ్యక్షులు జిల్లా సత్యం, బీజేవైఎం మండల అధ్యక్షుడు ఆరే శివ, నాయకులు తెడ్డు మహేష్, కాసోజీ ప్రతాప్, కల్లెడ ప్రసాద్, లకావత్ రాజేందర్, నవీన్, రాజం, రాంనాయక్, రాజేందర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్





- స్వయంగా తుపాకీ పట్టి గురి చూసిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**నేటి సాక్షి,వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో వార్షిక మొబిలైజేషన్ శిక్షణ కార్యక్రమాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం కొత్రేపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ఫైరింగ్ ప్రాక్టీస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా పాల్గొని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో ఆయుధాల పనితీరును స్వయంగా పరిశీలించిన ఎస్పీ, వివిధ రకాల తుపాకులతో ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించి తన గురిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు సిబ్బందికి ఆయుధ వినియోగంలో ఖచ్చితత్వం, వేగం మరియు సమన్వయం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఫైరింగ్ సమయంలో అనుసరించాల్సిన భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో మరియు విపరీతమైన ఒత్తిడిలో కూడా సమర్థవంతంగా స్పందించేందుకు ఇటువంటి శిక్షణలు ఎంతో దోహదపడతాయని ఆమె తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది తమ వృత్తిపరమైన నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని ఎస్పీ సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మరియు నూతన ఆయుధాల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండటం నేటి కాలంలో అవసరమని పేర్కొన్నారు. మొబిలైజేషన్ శిక్షణల ద్వారా శారీరక ధారుడ్యంతో పాటు మానసిక ధైర్యం, క్రమశిక్షణ పెరుగుతాయని, తద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని ఆమె పిలుపునిచ్చారు. ఈ ఫైరింగ్ ప్రాక్టీస్ కార్యక్రమంలో జిల్లా ఏఆర్ డీఎస్పీ వీరేష్, ఆర్ఐలు నాగరాజు, శ్రీశైలం, ఆర్ఎస్ఐలు మరియు వివిధ యూనిట్లకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలు నకిలీ ఇంటి నెంబర్లు

- అనుమతిలేని వెంచర్లపై ఉక్కుపాదం
- నిబంధనలు ఉల్లంఘిస్తే కూల్చివేతలు, కేసులు తప్పవు మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్ హెచ్చరిక



**నేటి సాక్షి గజ్వేల్ :** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ శాఖ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపట్టినా, ఖాళీ స్థలాలకు అక్రమంగా ఇంటి నెంబర్లు వాడినా, అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు చేసినా కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్ హెచ్చరించారు. నిబంధనలను అతిక్రమించే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు అక్రమ నిర్మాణాలను కూల్చివేయడానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపల్ అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తే వెంటనే సీజ్ చేసి, కూల్చివేత చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజలు తప్పనిసరిగా నిబంధనల ప్రకారం సెట్‌బ్యాక్ పాటిస్తూ, ఆమోదిత ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అనుమతులు తీసుకోకుండా లేదా అనుమతులు ఒకలా తీసుకుని నిర్మాణాలు మరోలా చేపట్టడం వంటి చర్యలను అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోరని కమిషనర్ హెచ్చరించారు. గతంలో కూడా మున్సిపల్ అనుమతులు లేకుండా నిర్మించిన ఓ బహుళ అంతస్తు భవనం పైకప్పును కూల్చివేసిన ఉదంతాన్ని గుర్తు చేస్తూ, ఇకపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. ప్రజ్ఞాపూర్ ప్రాంతంలో పాత ఇంటి నెంబరుతో ఖాళీ స్థలాన్ని కొనుగోలు చేసి, అదే ఇంటి నెంబర్/అసెస్మెంట్ నెంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న ఘటనలు తమ దృష్టికి వచ్చాయని కమిషనర్ పేర్కొన్నారు. ఖాళీ స్థలాలకు అక్రమంగా ఇంటి నెంబర్లు వాడటం, తప్పుడు వివరాలతో రిజిస్ట్రేషన్లు చేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ఈ తరహా వ్యవహారాలపై సమగ్ర విచారణ చేపట్టి, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అదేవిధంగా మున్సిపల్ అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు చేయడం, రోడ్లు వేసి ప్లాట్లు విక్రయించడం వంటి అక్రమ చర్యలపై కూడా కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తే వాటిని రద్దు చేసి, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణం, వెంచర్ల ఏర్పాటు, మోటేషన్ వంటి ప్రక్రియల కోసం ప్రజలు తప్పనిసరిగా పూర్తి ఆధారాలతో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ సూచించారు. మున్సిపల్ కార్యాలయం దరఖాస్తులను పూర్తిగా పరిశీలించిన తర్వాతే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. నిబంధనలను అతిక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ప్రమాదం ఏర్పడుతుందని, అందుకే ఎలాంటి రాజీ లేకుండా చర్యలు చేపడతామని కమిషనర్ వెంకట్ గోపాల్ స్పష్టం చేశారు. "చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేతలు, కేసులు తప్పవు" అని ఆయన మరోసారి హెచ్చరించారు.

# గజ్వేల్ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- ఊడెం సారిక శ్రీనివాస్ రెడ్డి
- కేసీఆర్ 10 ఏళ్లు సీఎంగా ఉండి రింగ్ రోడ్డు, బస్టాండ్ పనులు ఎందుకు పూర్తి చేయలేకపోయారు?
- నిధులు పక్క నియోజకవర్గాలకు తరలడంతో గజ్వేల్ అభివృద్ధి కుంటుపడింది



**నేటి సాక్షి,గజ్వేల్ :** గజ్వేల్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఊడెం సారిక శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం ఆమె గజ్వేల్‌లో మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షా రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంతో పాటు మున్సిపాలిటీలో అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ప్రతిపక్షాలు విమర్శలు చేయడమే తప్ప ప్రజలకు ఉపయోగపడే పనులు ఏవీ చేయలేదని ఆమె విమర్శించారు. 10 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ గజ్వేల్‌లో రింగ్ రోడ్డు, సీసీ రోడ్ల పనులు ఎందుకు పూర్తి చేయలేకపోయారో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. గజ్వేల్‌కు రావాల్సిన నిధులు పక్క నియోజకవర్గాలకు తరలిపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. అలాగే అండర్ డ్రైనేజీ పనులు ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన నియోజకవర్గాలను బీఆర్ఎస్ నాయకులు పరిశీలిస్తే గజ్వేల్‌కు జరిగిన అన్యాయం స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. అభివృద్ధి విషయంలో గజ్వేల్‌కు అన్యాయం జరిగిందని, పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో బస్టాండ్ నిర్మాణం ఎవరి కోసం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. పక్క నియోజకవర్గంలో ఆరు నెలల్లో బస్టాండ్ పూర్తయితే, గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లో ఆరేళ్లు గడిచినా బస్టాండ్ పనులు ఎందుకు పూర్తికాలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్నా, మాజీ ముఖ్యమంత్రి అయిన కేసీఆర్ గజ్వేల్‌కు నిధులు తీసుకురావాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఇప్పటికైనా విమర్శలు మానుకుని గజ్వేల్ అభివృద్ధి కోసం కేసీఆర్ ముందుకు రావాలని ఆమె సూచించారు.

# కాంగ్రెస్ కౌన్సిలర్ రిజ్వాన్ నూతన లాడ్జ్ ప్రారంభం



- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభోత్సవం

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ రిజ్వాన్ కు చెందిన నూతన లాడ్జ్‌ను వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు, కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత-గంగాధర్ ముఖ్య అతిథులుగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కోరుట్ల పట్టణంలో నూతనంగా నిర్మించిన ఈ లాడ్జ్ ప్రారంభోత్సవం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రిబ్బన్ కట్ చేసి లాడ్జ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులౌ రిజ్వాన్ వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రజా సేవతో పాటు వ్యాపార రంగంలో కూడా ముందుకు సాగడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు, కోరుట్ల మున్సిపల్ చైర్మన్ తిరుమల వసంత-గంగాధర్ పాల్గొని రిజ్వాన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పార్టీ నాయకత్వం సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం కోరుట్లలో చర్చనీయాంశంగా మారింది.


# విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం యువరైతు బలి



- 12 ఏళ్ల క్రితం ఒకరు.. నేడు మరొకరు..
- ఒకే కుటుంబంలో తీరని విషాదం
- హెచ్చరించినా పట్టించుకోని వైనం..
- పేట మాధారంలో గ్రామస్థుల ఆగ్రహం

**నేటి సాక్షి, పేట మాధారం (సురేష్ మోత్కూర్):** అతడు ఆ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటాడనుకున్న ఆశ.. పచ్చని పొలానికి నీరు పోసి బంగారు పంట పండిస్తాడన్న నమ్మకం.. అంతా ఒక్క క్షణంలో బూడిదైపోయింది. నిత్యం రైతులకు అండగా ఉండాల్సిన వ్యవస్థలోని నిర్లక్ష్యం, ఒక నిండు ప్రాణాన్ని గాలిలో కలిపేసింది. పరిగి మండలం పేట మాధారం గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన, అధికారుల మొద్దునిద్రకు పరాకాష్టగా నిలిచింది. వివరాల్లోకి వెళితే.. మంచన్‌పల్లి కురువ అనంతయ్య కొడుకు మహేందర్ (24) అనే యువరైతు ప్రతిరోజూలాగే బుధవారం ఉదయం తన పొలానికి వెళ్లాడు. పంటకు నీరు పెట్టేందుకు బోర్ మోటార్ స్టార్ట్ చేయబోయాడు. అయితే, అప్పటికే అక్కడ పొంచి ఉన్న మృత్యువు విద్యుత్ షాక్ రూపంలో అతడిని కబళించింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా జరిగిన విద్యుత్ సరఫరా లోపంతో మహేందర్ అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. గ్రామస్థుల కథనం ప్రకారం.. ఈ కుటుంబానికి విద్యుత్ శాఖ శాపంగా మారింది. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే కుటుంబానికి చెందిన మరొక వ్యక్తి కూడా ఇలాగే విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల మరణించారు. దశాబ్దం గడిచినా అధికారుల తీరులో మార్పు రాకపోవడంపై గ్రామస్థులు మండిపడుతున్నారు. "లైన్మెన్లకు, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. రైతులకు తెలియకుండా ఇష్టానుసారంగా లైన్లు మార్చవద్దని కొత్త సర్పంచ్ ఆధ్వర్యంలో తీర్మానం చేసి ఇచ్చినా వారు పట్టించుకోలేదు" అని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన లేకపోవడం, హెచ్చరికలను బేఖాతరు చేయడం వల్లే నేడు మహేందర్ ప్రాణాలు పోయాయని, ఒక కుటుంబం వీధిన పడిందని వారు కన్నీటి పర్యంతమయ్యారు. ఘటనపై సమాచారం అందుకున్న పరిగి పోలీసులు క్షేత్రస్థాయికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మోహన్ కృష్ణ తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పేట మాధారం గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం






- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- కోరుట్లలో రూ. 1.05 కోట్లకు పైగా 'సీఎంఆర్ఎఫ్' చెక్కుల పంపిణీ.. 315 మందికి ఆర్థిక వెసులుబాటు
- నియోజకవర్గంలో ఇప్పటివరకు 1600 మందికి రూ. 6.50 కోట్ల సాయం: జువ్వాడి నర్సింగరావు

**నేటి సాక్షి,కోరుట్ల (రాధారపు నర్సయ్య):** పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యం మరియు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం కోరుట్ల పట్టణంలోని జీఎస్ గార్డెన్‌లో నిర్వహించిన ముఖ్యమంత్రి సహాయనిధి (జవీ=ఖీ) చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఒకే రోజు 315 మంది లబ్ధిదారులకు రూ. 1,05,46,000 విలువైన చెక్కులను కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ తిరుమల వసంత-గంగాధర్ లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను రూ. 8 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో భారీ అవినీతికి పాల్పడి, నాణ్యత లేని నిర్మాణాలు చేశారని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సంక్షేమ పథకాలను నిరంతరాయంగా కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే ఐదింటిని అమలు చేశామని, త్వరలోనే ఆరో గ్యారంటీని కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ.. కోరుట్ల చరిత్రలోనే ఒకే రోజు కోటి రూపాయలకు పైగా సహాయనిధి అందించడం చారిత్రాత్మకమని అన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 1600 మందికి రూ. 6.50 కోట్ల మేర సాయం అందించి ఆదుకున్నామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల మంజూరుతో పాటు రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టామని తెలిపారు. గత పాలకులు బాండ్ పేపర్లు రాసిచ్చి పదేళ్లు కాలయాపన చేసిన కొండ్రికర్ల బ్రిడ్జికి, కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని నర్సింగరావు తెలిపారు. త్వరలోనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మున్సిపల్ ఛైర్మన్ మైలారపు లింబాద్రి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ పన్నాల అంజిరెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు మహమ్మద్ షాహిద్ ఉల్ ఆహాద్, ఓంకార్ నవీన్, వివిధ మండలాల మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కౌన్సిలర్లు మరియు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



**నేటిసాక్షి,నల్లబెల్లి:** విద్యార్థులు ఉన్నత ఆలోచనలతో ఉత్తమ ఫలితాలు సాధించి కష్టపడి ఇష్టంగా చదువుకొని అత్యున్నత శిఖరాలను అధిరోహించి సమాజంలో మంచి గుర్తింపును తెచ్చుకోవాలని మండలంలోని నాగరాజు పల్లి సర్పంచ్ ఎరుకల లలిత రఘు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కర్ణ కంటి రామ్మూర్తి అధ్యక్షతన విద్యార్థులకు ఉత్తీర్ణత ప్రగతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ శ్రద్ధ ఆసక్తి అలవర్చుకొని ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను పఠనం చేసినట్లయితే పరీక్షల సమయంలో సులభంగా సమాధానాలు రాయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి ఆటపాటలపై మొగ్గుచూపాలన్నారు. సమాజ శ్రేయస్సు కోసం చిత్రలేఖనం వేయడం లాంటి అంశాలపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏఏపిసి చైర్మన్ ఎరికల వెంకటలక్ష్మి మామిండ్ల వీరయ్య పల్లి మాజీ సర్పంచ్ ఆసం చంద్రమౌళి. ఉపాధ్యాయులు కునుమల్ల రాజన్ బాబు. విద్యార్థులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు

## భారతీయులందరికీ అవమానం ఖర్గే తక్షణమే క్షమాపణ చెప్పాలి



**నేటి సాక్షి,జగిత్యాల(పూరెళ్ల బాపు):** తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే దేశ ప్రధాని నరేంద్ర మోదీపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు తీవ్రంగా ఖండించారు. బుధవారం జగిత్యాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీని 'ఉగ్రవాది'గా చిత్రీకరించడం, దక్షిణాది రాష్ట్రాల హక్కులను హరిస్తున్నారని ఖర్గే మాట్లాడటం అత్యంత హేయమని రాజు మండిపడ్డారు. "సబ్ కా సాత్ - సబ్ కా వికాస్" నినాదంతో కుల, మత, ప్రాంతీయ భేదాలు లేకుండా దేశాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రధానిని కించపరచడం అంటే 140 కోట్ల మంది భారతీయులను అవమానించడమేనని ఆయన పేర్కొన్నారు. ఉగ్రవాదులకు, దేశద్రోహులకు వత్తాసు పలికే చరిత్ర కాంగ్రెస్ పార్టీదని విమర్శిస్తూ.. ఖర్గే తన వ్యాఖ్యలకు తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం దేశాధినేతను ఉగ్రవాదితో పోల్చడం కాంగ్రెస్ దిగజారుడుతనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో 22వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి, ప్రధాన కార్యదర్శి అక్కినపల్లి కాశీనాథం, కార్యదర్శి సింగం గంగాధర్, ఉపాధ్యక్షులు వేముల పోచమల్లు, చెట్ల గంగాధర్, నరేందుల శ్రీనివాస్, వేముల దేవరాజం, ఎడమల వెంకట్ రెడ్డి, బొందుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి విషం కక్కడం మానాలి

## కోర్టు తీర్పుతోనైనా బుద్ధి తెచ్చుకో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి



**నేటి సాక్షి గజ్వేల్:** కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనవసరంగా విమర్శలు చేస్తూ విషం కక్కుతున్నారని, కోర్టు తీర్పుతోనైనా ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి హితవు పలికారు. బుధవారం గజ్వేల్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పని చేయాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత రెండున్నర సంవత్సరాలుగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శించడం తప్ప మరో పని చేయలేదని ఆయన ఆరోపించారు. కాళేశ్వరం అంశంలో కోర్టు తీర్పు కడిగిన ముత్యంలా కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులకు అనుకూలంగా వచ్చిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై అవగాహన లేకుండా సీఎం మాట్లాడుతున్నారని, ఆయనతో పాటు మంత్రివర్గం కూడా అదే బాటలో ముందుకు సాగుతోందని ఎమ్మెల్సీ విమర్శించారు. మిగిలిన రెండు సంవత్సరాలైనా ప్రజా సంక్షేమం కోసం పని చేయాలని, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన కేసీఆర్‌పై విమర్శలు మానుకోవాలని సూచించారు. అలాగే ఢిల్లీ కాంగ్రెస్ ఇక్కడ రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా ఉంచేది డబ్బు సంచులు పంపిస్తారని మాత్రమేనని, తెలంగాణ అభివృద్ధి చేస్తాడనే నమ్మకంతో కాదని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం మానేసి ఇతరులపై దుమ్మెత్తిపోసే రాజకీయాలు చేయడం సరికాదని హెచ్చరించారు.

# శంకర్‌పల్లిలో ఇంద్రారెడ్డి వర్ధంతి

## బీఆర్ఎస్ నేతలు శశిధర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నివాళులు



**నేటి సాక్షి,శంకర్‌పల్లి(సుధాకర్ గౌడ్) :** శంకర్‌పల్లిలో స్వర్గీయ మాజీ మంత్రివర్యులు పట్లోళ్ల ఇంద్రారెడ్డి గారి వర్ధంతిని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ శంకర్‌పల్లి మున్సిపల్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి మరియు బీఆర్ఎస్ పార్టీ శంకర్‌పల్లి మండల అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముందుగా నేతలు ఇంద్రారెడ్డి గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను, ప్రజలకు అందించిన సహకారాన్ని గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పనిచేసి తెలంగాణ అభివృద్ధికి ఇంద్రారెడ్డి గారు ఎనలేని కృషి చేశారని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, యువజన విభాగం సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణానికి నిధులివ్వండి

## కార్పొరేటర్ కాల్వ మల్లేశం విజ్ఞప్తి..



**నేటి సాక్షి తిమ్మాపూర్:** కరీంనగర్ కార్పొరేషన్ పరిధి 8వ డివిజన్ అలుగునూర్ లోని మండల పరిషత్ పాఠశాల మధ్యలోనే ఆగిపోగా, బుధవారం ఆయన పాఠశాలను పరిశీలించారు కార్పొరేటర్ కాల్వ మల్లేశం. పాఠశాల భవన నిర్మాణం సగంలోనే ఆగిపోవడంతో కారణాలను హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. బిల్లులు సకాలంలో రాకపోవడం వల్లే పనులు నిలిచిపోయాయని తెలుసుకొని, కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అదేవిధంగా సంబంధిత అధికారులతో కూడా మాట్లాడి, బిల్లులు విడుదల అయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని నిధులు మంజూరయ్యేలా చూడాలని పత్రికా ముఖంగా ఆయన కోరారు.

TGTEL/25/A1737 | NETI SAKSHI

## ప్రభుత్వాలపై తిరుగుబాటు

**బీసీలు సిద్ధంగా ఉండాలి బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్**



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తిరుగుబాటుకు బిసి బిడ్డలు సిద్ధంగా ఉండాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. పట్టణంలోని బీసీ భవన్ లో, బిసి యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ, బీసీలను ప్రభుత్వాలు ఓటు బ్యాంకు గానే చూస్తున్నాయి తప్ప, బీసీలకు దక్కవలసినటువంటి ఏ ఒక్క హామీలు రాజకీయ పదవులు, రిజర్వేషన్ లు, విద్యార్థుల స్కాలర్షిప్స్ నామినేట్ పదవుల్లో బీసీలకు అన్యాయం, సర్పంచ్, కౌన్సిలర్ ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేస్తూ, ఎన్నికల సమయంలో మాత్రం బీసీలపై కపట ప్రేమ దొంగ హామీలు ఇచ్చి గద్దెని ఎక్కుతున్న పార్టీలకు వ్యతిరేకంగా బీసీలందరూ ఉమ్మడిగా పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్క నాగేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు రవీందర్ గౌడ్, బీసీ యువజన సంఘం పట్టణ నాయకులు రమేష్ యాదవ్, ఉదయ్, నవీన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డికి చెంపపెట్టు

**కాళేశ్వరంపై రాజకీయ కుట్రలు విఫలమయ్యాయి**




**నేటి సాక్షి వికారాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టు పై జస్టిస్‌పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను నిలిపివేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు రేవంత్ రెడ్డికి చెంపపెట్టు. ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు స్టే ను స్వాగతిస్తున్నాం. కమిషన్ పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యాన్ని దెబ్బతీయాలని రేవంత్ రెడ్డి చేసిన కుట్ర హైకోర్టు తీర్పుతో పూర్తిగా విఫలం అయింది. కెసిఆర్ మీద అక్కసుతో లేని అవినీతిని అంటగట్టాలని ఘోష్ కమిషన్ పేరుతో రేవంత్ రెడ్డి చేసిన ప్రయత్నం రాజకీయ కక్షలో భాగమేనని హైకోర్టు తీర్పుతో తేలిపోయింది. రాజకీయ కక్షసాధింపు చర్యలో భాగంగా అధికార దుర్వినియోగం చేస్తున్న రేవంత్ రెడ్డికి ఈ తీర్పు ఒక గుణపాఠం.మీకున్న సమయంలో రెండున్నర సంవత్సరాల విలువైన సమయాన్ని వృధా చేశారు. వచ్చే సంవత్సరం సూపర్ ఎల్‌నినో వల్ల కరువు వస్తుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తుంది. ఇప్పటికైనా రాజకీయ కుట్రలు పక్కన పెట్టి, కుంగిన రెండు పిల్లర్లను వెంటనే రిపేర్ చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.కాళేశ్వరం తెలంగాణకు ప్రాణాధారం.

## క్షయ వ్యాధిపై అవగాహన ఉండాలి

**డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాస్ చలిగల్‌లో టీబీ వైద్య శిబిరం**



**నేటి సాక్షి ,జగిత్యాల (పూరెళ్ల బాపు):** 'టీబీ ముక్త్ భారత్ అభియాన్' లక్ష్యంలో భాగంగా క్షయ వ్యాధి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జగిత్యాల జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం చలిగల్ గ్రామంలో క్షయ వ్యాధిగ్రస్తుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన, టీబీ వ్యాధి లక్షణాలు మరియు నివారణోపాయాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి తగ్గని దగ్గు ఉండటం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి మందగించి బరువు తగ్గడం, తెమడలో రక్తం పడటం వంటి లక్షణాలు ఉంటే వెంటనే అనుమానించాలని సూచించారు. ఇటువంటి లక్షణాలు ఉన్నవారు జాప్యం చేయకుండా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత మందులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కల్లెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ.. శిబిరానికి విచ్చేసిన సుమారు 60 మంది గ్రామస్తులకు అత్యాధునిక డిజిటల్ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించామని తెలిపారు. పరీక్షల అనంతరం వారికి వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో చలిగల్ సర్పంచ్ రాజేందర్, ఉపసర్పంచ్ రూమన్, ఎం.ఎల్.హెచ్.పిలు డాక్టర్ శామిని, అనూష, హెల్త్ సూపర్వైజర్ సుజాత పాల్గొన్నారు. వీరితో పాటు టీబీ సూపర్వైజర్ శ్రీనివాస్, రేడియో గ్రాఫర్ వికాస్, ఏఎన్ఎంలు షమీం సుల్తానా, జయప్రద మరియు ఆశా కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బీసీ కులాలు ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం

- గ్రామస్థాయిలో బీసీలు చైతన్యం కావాలి: జిల్లా నాయకులు వెంకట్ రాములు
- మరికల్‌లో బీసీ కులాల ఐక్య సదస్సు విజయవంతం.. సర్పంచులకు ఘన సన్మానం



**నేటి సాక్షి,మరికల్ (ఇమామ్):** తెలంగాణ రాష్ట్రంలోని బీసీ కులాలన్నీ ఐక్యమత్తంగా ఉండి తమ హక్కుల కోసం పోరాడాలని నారాయణపేట జిల్లా బీసీ కులాల సంఘం నాయకులు వెంకట్ రాములు పిలుపునిచ్చారు. బుధవారం మరికల్ మండల కేంద్రంలోని శివాలయంలో మండల స్థాయి బీసీ కులాల సంఘం ఆధ్వర్యంలో భారీ ఐక్య సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని వివిధ గ్రామాల నుండి బీసీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా వెంకట్ రాములు మాట్లాడుతూ.. రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో బీసీలు ఐక్యంగా ఉండి తమ రాజకీయ సత్తాను చాటాలన్నారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు దక్కాల్సిన వాటాను సాధించుకోవాలంటే ఐక్యత ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. అనంతరం వివిధ గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచులను సంఘం తరపున శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. సదస్సులో చిత్తనూరు గ్రామ సర్పంచ్ మురళి యాదవ్ బీసీ కులాల ఆత్మగౌరవంపై పాడిన పాట కార్యకర్తలను విశేషంగా ఆకట్టుకుంది. సభికులందరూ చప్పట్లతో ఆయనకు సంఘీభావం తెలిపారు. కనుమూరు సర్పంచ్ నరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. త్వరలోనే గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు వరుస సమావేశాలు నిర్వహించి బీసీల ఐక్యతను చాటిచెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, నాయకులు కానుగంటి నారాయణ, బాలకృష్ణ గౌడ్, కె. కృష్ణయ్య, గొల్ల కృష్ణయ్య, నర్మద రవికుమార్ గౌడ్, కటికే కాజా, గోవర్ధన్, వైన్స్ రఘు, పండ్ల శేఖర్, పసుపుల తిమ్మప్ప గౌడ్, చంద్రయ్య, నరసింహా, బొంత మొగులయ్య, మక్తల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి




**నేటి సాక్షి,చౌడేపల్లి :** మహిళలు చట్టాల పట్ల సమాజ పోకడల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎస్సై చిన్నారెడ్డప్ప అన్నారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ దిరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు, బుధవారం బోయకొండ నందు మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చౌడేపల్లి ఎస్సై చిన్న రెడ్డప్ప సిబ్బంది పాల్గొని ప్రజలకు విలువైన సూచనలు అందించారు టీనేజ్ వయస్సులో ఎదురయ్యే ఆకర్షణలను నియంత్రించకపోతే భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను వివరించారు. ఫోక్సో చట్టం పై పూర్తి వివరణ ఇచ్చారు చదువు ద్వారా వ్యక్తిగత స్థాయి ఎలా పెంపొందించుకోవచ్చో మన ప్రవర్తన ఇతరులకు ఆదర్శంగా ఉండాల్సిన అవసరం తల్లిదండ్రులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేయకుండా బాధ్యతగా ఉండడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. చిన్న చిన్న విషయాలకు గొడవలు పడకుండా సహనంతో వ్యవహరించాలన్నారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, సెల్ ఫోన్ల ద్వారా జరుగుతున్న మోసాలు వాటిపట్ల అప్రమత్తంగా ఉండాల్సిన విధానం వంటి వాటిపై అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వల్ల పిల్లల జీవితాలకు కలిగే దుష్ప్రభావాలు అంతేకాకుండా, మహిళలు పిల్లల భద్రత కోసం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తి యాప్ ఉపయోగాలు, అత్యవసర సహాయ నెంబర్లు 1930, 112, 1098 గురించి విద్యార్థులకు వివరించారు ఈ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో చట్టాలపై అవగాహనతో పాటు బాధ్యతాయుతమైన ప్రవర్తన పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు మదనపల్లి శక్తి టీం సభ్యులు మునికుమార్ నాయక్, శశికళ మణికంత, వీణ కుమారి స్థానిక మహిళలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

# మృత్యుంజయశ్వర స్వామి ఆలయంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు




- తొలి రోజున ధ్వజారోహణం రాత్రి సింహ వాహనము

**నేటి సాక్షి,చౌడేపల్లి:** స్థానిక మృత్యుంజయశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి .ఈనెల 21న అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి బుధవారం పద్మశాలి కులస్తులు ఉభయదారులుగా ధ్వజారోహణము రాత్రి స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను సింహ వాహనము పై ఉంచి పట్టణంలో ఊరేగించారు . ఈ కార్యక్రమానికి విశ్వబ్రాహ్మణ కులస్తులు ఉబయదారులుగా వ్యవహరించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్ దీక్షితులు కుమారస్వామి మహేష్ స్వాముల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరిగాయి దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు పర్యవేక్షించారు

# విద్యార్థుల ప్రతిభకు వేదికగా 'చదువుల పండుగ'




- అట్టహాసంగా 'చదువుల పండుగ 2.0'.. ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్
- రాష్ట్ర విద్యాశాఖకే దిక్సూచిగా నారాయణపేట నవకల్పనలు: కలెక్టర్ ఆకాంక్ష

**నేటి సాక్షి,నారాయణపేట(ఇమామ్ సాబ్):** విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను మరియు ప్రతిభను వెలికితీయడానికి 'చదువుల పండుగ' వంటి కార్యక్రమాలు ఒక గొప్ప వేదికగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన "చదువుల పండుగ 2.0" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సరస్వతీ మాత చిత్రపటానికి పూజలు నిర్వహించి, జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గత రెండు మూడేళ్ల నిరంతర కృషికి ఫలితమే ఈ చదువుల పండుగ అని కొనియాడారు. గత కలెక్టర్లు కోయ శ్రీహర్ష, సిక్తా పట్నాయక్ హయాంలో జిల్లాలో ప్రారంభమైన వినూత్న విద్యా కార్యక్రమాలు నేడు మంచి ఫలితాలను ఇస్తున్నాయని గుర్తు చేశారు. తాను పని చేసిన ఏ జిల్లాలోనూ ఇటువంటి అద్భుతమైన విద్యా ప్రదర్శనలు చూడలేదని అభినందించారు. విద్యార్థులు కొత్త ఆలోచనలతో జిల్లాకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి, క్విజ్, రీడింగ్, స్పెల్-బీ పోటీల్లో వారి ప్రతిభను చూసి ముగ్ధులయ్యారు. ఈ పండుగలో 3 నుండి 7వ తరగతి విద్యార్థులు మండల స్థాయిలో విజేతలై, జిల్లా స్థాయి పోటీల్లో తలపడ్డారు. తెలుగు, ఆంగ్లం, గణితం వంటి సబ్జెక్టులతో పాటు వేదిక్ మ్యాథ్స్, మెమరీ టెక్నిక్స్, యంగ్ ఒరేటర్స్ క్లబ్ వంటి వినూత్న అంశాలపై పోటీలు నిర్వహించడం రాష్ట్రంలోనే ఇదే మొదటిసారి కావడం విశేషం. వివిధ స్వచ్ఛంద సంస్థలు (చీ+హాం) తమ విద్యా పరికరాలను, డిజిటల్ లిటరసీ మరియు కెరీర్ గైడెన్స్ స్టాళ్లను ప్రదర్శించాయి. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎం. గోవింద రాజు మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి సర్వేలో ఎఫ్.ఎల్.ఎన్ (ఖీూచీ) పనితీరులో మన జిల్లా రాష్ట్రంలోనే టాప్ 5 స్థానాల్లో నిలిచిందని గర్వంగా వెల్లడించారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో జిల్లాను 'రైసింగ్ డిస్ట్రిక్ట్'గా గుర్తించారని తెలిపారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను మరింత పెంపొందించేందుకు తమ శాఖ నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ విద్యాసాగర్, సెక్టోరియల్ అధికారులు నాగార్జున, శ్రీనివాస్, సైన్స్ అధికారి భాను ప్రకాష్, వివిధ మండలాల ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు మరియు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# క్రీడాకారుల నుండి దరఖాస్తుల స్వీకరణ





**నేటి సాక్షి నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని గ్రామీణ ప్రాంతములలో వేసవి క్రీడా శిక్షణా శిభిరాలను నిర్వహించుటకు వ్యాయామెపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారుల నుండి దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు డివైఎస్ఓ వెంకటేష్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారము, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్), జిల్లా యువజన మరియు క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని గ్రామీణా ప్రాంతములో ఈ నెల 24నుండి జూన్ 7వరకు వేసవిలో నిర్వహించే ( వివిధ క్రీడాంశాలకు) క్రీడాశిక్షణా శిభిరాలు నిర్వహించదలచిన వ్యాయామెపాధ్యాయులు (పి.డి లేదా పి.ఇ.టి) లేక సీనియర్ క్రీడాకారుల నుండి దరఖాస్తులు కోరడమైనది. సీనియర్ క్రీడాకారులైతే కనీసం జాతీయ స్థాయి పోటీలలో పాల్లోని ఉండాలి. తమ దరఖాస్తుతో పాటు సంబంధిత క్రీడలలో తాము సాధించిన దృవపత్రములను (సర్టిఫికెట్స్) జతపరుచవలెను. స్థానికంగా ఉండి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించగలిగే వారు మాత్రమే దరఖాస్తు చేసుకోనవలెను. దరఖాస్తును జిల్లా యువజన మరియు క్రీడాల కార్యాలయము మినీ స్టేడియం నారాయణపేట జిల్లా నందు వ్యక్తిగతంగా లేదా పోస్టు ద్వారా 23-04-2026 తేదీలోగా అందేలా పంపవలయును . గ్రామీణ మరియు కొత్త సెంటర్లకు ప్రాముఖ్యత ఇవ్వబడుననీ తెలిపారు.

# వేసవిలో తాగునీటి ఎద్దడి రానీయొద్దు

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ప్రతిరోజూ స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలి.. రానున్న 45 రోజులు అత్యంత కీలకం
- ఐడీఓసీలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష



**నేటి సాక్షి,రాజన్న సిరిసిల్ల (శివకుమార్):** జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు అన్ని గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా నిత్యం సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (IDOC)లో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, నీటి పారుదల మరియు పబ్లిక్ హెల్త్ అధికారులతో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనులపై ఆమె సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవి తీవ్రత దృష్ట్యా రానున్న 45 రోజులు చాలా కీలకమని, మిషన్ భగీరథ ద్వారా నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రతి వార్డుకు, ప్రతి గ్రామానికి నీటిని చేరవేయాలని సూచించారు. ముఖ్యంగా విలీన గ్రామాలు, శివారు ప్రాంతాలకు నీటి సరఫరాలో ఎక్కడా అంతరాయం కలగకుండా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ఆదేశించారు. పైప్‌లైన్ లీకేజీలు లేకుండా చూడాలని, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు మరియు మోటార్లు నిరంతరం పని చేసేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలకు సరఫరా చేసే నీటిని ప్రతిరోజూ క్లోరినేషన్ చేయాలని, ప్రతి పది రోజులకు ఒకసారి నీటి ట్యాంకులను విధిగా శుభ్రం చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రాజెక్టులలో నీటి మట్టాలను గమనిస్తూ ఉండాలని, అవసరమైతే స్థానిక నీటి వనరులను వినియోగించుకోవాలని తెలిపారు. అలాగే అమృత్ పథకం కింద చేపట్టిన ఓహెచ్ఎస్ఆర్ (OHSR) నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ఈ అమరేందర్, ఈఈలు అన్వర్, సుమలత, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్, డీఆర్డీఓ గీత, సీపీఓ శ్రీనివాసాచారి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సమ్మెతో.. విలవిల

బోయిన ఆర్టీసీ బస్టాండ్లు.



**నేటి సాక్షి,నారాయణపేట(ఇమామ్ సాబ్):** తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ఆర్టీసీ బస్సుల సమ్మెతో నారాయణపేట జిల్లాలోని పలు ఆర్టీసీ బస్టాండ్లు బస్సు లేక విలవిల పోయాయి. ప్రయాణికులు బస్సుల కోసం ఎండల్లో నిలబడి నాన్న ఇబ్బందులకు గురయ్యారు. ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రైవేటు వాహనాలతో ఉక్కిరిబిక్కిరిగా గ్రామాలకు వెళ్ళవలసిన పరిస్థితి నెలకొంది. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆర్టీసీ బస్సుల సమ్మెను విరమింపజేసి యధావిధిగా కొనసాగిలా చూడాలని నారాయణపేట జిల్లాలోని వివిధ గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# తొగుటలో బాలమేళా



**నేటి సాక్షి,తొగుట.(వడ్డే నరసింహులు):** తొగుటలో నాలుగు అంగన్వాడి సెంటర్ కలిపి బాలమేళా కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ శోభ కొండల్ రెడ్డి, బ్లాక్ కో -ఆర్డినేటర్ భాస్కర్, సూపర్ వైజర్ శ్రీలేఖ, లో పిల్లలు ఆటలు, పాటలు, కథలు, పూర్వ గణిత భావనలు ప్రదర్శించారు తల్లుల తో ఆటలు ఆడిపించారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బ్లాక్ కో ఆర్డినేటర్ భాస్కర్ మాట్లాడుతూ పిల్లలు ఈ వయసులో ఒత్తిడికి గురి కాకుండా స్వేచ్ఛగా ఆటలు పాటలతో చదువు నేర్పించాలి, అందుగురించి ప్రభుత్వం అంగన్వాడీ సెంటర్ లో ప్లే బేస్డ్ లెర్నింగ్ ద్వారా నేర్పిస్తున్నారు కానీ ఈ విషయాలు అర్థం కాక నేటి తల్లి తండ్రులు అక్షరాలు ముఖ్యమని ప్రైవేట్ పంపిస్తున్నారు అక్కడ బట్టి విధానం అలవాటు చేస్తున్నారు ఇది పిల్లల ఎదుగుదల కి మంచిది కాదు ఈ విషయాలు అర్థం కావాలనే ఈ బాలమేళా కార్యక్రమం చేస్తున్నాం, కాబట్టి 3 సంవత్సరాలనుండి అందరిని అంగన్వాడీ కి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు అనిత, విజయ,మాధవి, వసంత వార్డు మెంబర్లు బలవ్వ, కానీ, వివో లీడర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం





- తొగుట మండలంలోని పలు గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- దళారులను నమ్మి మోసపోవద్దు.. మద్దతు ధరకే ధాన్యం విక్రయించాలి

**నేటి సాక్షి, తొగుట(వడ్డే నరసింహులు):** రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం తొగుట మండలంలోని లింగాపూర్, వా బంజరు పల్లి, జప్తి లింగారెడ్డి పల్లి, చందపుర్, ఎల్లారెడ్డిపేట, పెద్ద మాసంపల్లి, బండారుపల్లి, ఘణపురం, తుక్కాపూర్, వెంకట్రావుపేట, గుడి కందుల, వరదరాజు పల్లి, గోవర్ధనగిరి గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటకు సరైన ధర కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల ద్వారా పంటను విక్రయించుకోవడం వల్ల రైతులకు అధిక లాభం చేకూరుతుందని చెప్పారు. రైతులు తమ ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఎండబోసి కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో ఎక్కడా జాప్యం జరగకుండా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్), దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి లతా నరేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి, ఏవో మోహన్, ఏపీఎం బాబురావు, కోపరేటివ్ సెక్రటరీ గంగరెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు పిట్ల నర్సింలు, కనకయ్య, కవిత, లావణ్య స్వామి, లచ్చోళ్ళ రవీందర్, కళావతి స్వామి, రమేష్, పాగాల శోభ కొండల్ రెడ్డి, రాజిరెడ్డి, సమీరా రెడ్డి, శ్రీకాంత్, గోపాల్ రెడ్డి మరియు సీనియర్ నాయకులు కూచి మైపాల్ రెడ్డి, బూస నిరంజన్ రెడ్డి, సిలివేరి రాంరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గ్రామీణ పారిశుధ్యం పై దృష్టి పెట్టాలి



**నేటి సాక్షి, చౌడేపల్లి :** గ్రామీణ ప్రాంత పారిశుధ్యం పై దృష్టి పెట్టాలని డివైఎంపీడీవో గఫూర్ అన్నారు. మండలంలోని ఆమెనిగుంట పంచాయితీ సింగిరిగుంట పందిళ్ళపల్లి తదితర ప్రాంతాలలో ఆయన ఉదయాన్నే చెత్త సేకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు .హరిత రాయబారులు ప్రతి ఇంటి నుంచి తడి పొడి చెత్తలను సేకరించి సమీపంలోని ఎస్ డబ్ల్యూ పిసి కేంద్రాలలో నిల్వ చేయాలన్నారు. అక్కడ సేంద్రియ ఎరువుల తయారీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను సేకరించి ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో పి డి ఓ లు మోహన్ అమరనాథ్ హరిత రాయబారులు గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు

## బాధిత కుటుంబానికి ఎమ్మార్పీఎస్ భరోసా



**నేటి సాక్షి, ఎండపల్లి:** ఉమ్మడి మండలంలోని రాజక్కపల్లి గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కుశనపల్లి శ్రీనివాస్ విద్యుత్ షాక్‌కు గురై మంగళవారం మృతి చెందారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం శ్రీనివాస్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉమ్మడి వెల్గటూర్ మండల అధ్యక్షుడు చెన్న కుమారస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకేనపల్లి సతీష్ కుటుంబ సభ్యులను ఓదార్చుతూ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ దుర్ఘటన కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, వారి బాధను పంచుకున్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని, అవసరమైన సహాయం అందిస్తామని నాయకులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు తాటి నాగరాజు, వార్డు సభ్యులు చెన్న అంజయ్య, చెన్న ప్రేమ్ సాగర్, బచ్చల వినయ్, ఉమ్మడి మండల ఎమ్మార్పీఎస్ నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వెంకట్రావుపేటలో వడ్ల కొనుగోలు



**నేటి సాక్షి, తొగుట(వడ్డే నరసింహులు):** వెంకట్రావుపేట గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, మాట్లాడుతూ రైతులు వడ్లను కొనుగోలు కేంద్రంలోని అమ్ముకోవాలి బయట దళారులకు అమ్మి మోసపోవద్దు అని అన్నారు అట్లాగే వడ్లను సకాలంలో మిల్లులకు తరలించాలని అధికారులకు సూచించారు కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అమర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి కలిసి ప్రారంభించరూ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజవ్వ రాములు కాంగ్రెస్ సైన్యం పాల్గొన్నారు

## దళారులకు అమ్ముకోవద్దు

సర్పంచుల ఫోరం అధ్యక్షులు పొన్నం సునీత అనిల్‌గౌడ్



**నేటి సాక్షి, తిమ్మాపూర్:** రైతులు ధాన్యం దళారులకు అమ్మకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి.. మద్దతు ధర పొందాలని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు, మన్నెంపల్లి సర్పంచ్ పొన్నం సునీత అనిల్‌గౌడ్ అన్నారు. గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించి, మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇంచార్జి శివనాగేందర్‌రెడ్డి, పొరండ్ల పీఏసీఎస్ సీఈవో మదన్ శ్రీనివాస్, అర్జల సత్యనారాయణ రెడ్డి, తొడుపునూరి రాజు, అనగోని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మేడి అంజయ్య, దుర్గం జంపయ్య, కొలకాని రాజయ్య, మాచెర్ల ఎల్లయ్య, నాంపల్లి తిరుపతి, కలిపాక మధు, శానగొండ నరసింహ స్వామి, శానగొండ కనకయ్య, నాంపల్లి అంజయ్య, నాంపల్లి శంకరయ్య, తాళ్లపెల్లి కొమురయ్య, బీనపెల్లి బాలయ్య, దరిపెల్లి రవీందర్, నాంపల్లి శ్రీనివాస్, కొలిపాక స్వామి, పారునంది కిషోర్, బీనపెల్లి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# సమాజ మార్పులో పుస్తకానిదే కీలక పాత్ర

ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంలో పుస్తకాల ప్రాముఖ్యతను మరొకసారి ఆలోచించాల్సిన అవసరం ఉంది. మనిషి ఎదుగుదల అతని ఆలోచనలపై ఆధారపడి ఉంటుంది. ఆ ఆలోచనలకు దిశానిర్దేశం చేసే శక్తి పుస్తకాలది. భావ ప్రసారం, భావ వినిమయం ద్వారా సమాజం మార్పు చెందుతుంది; ఆ భావాలను తరతరాలకు అందించే అత్యంత విశ్వసనీయ సాధనం పుస్తకమే.

పుస్తకం కేవలం కాగితాల సమాహారం కాదు; అది అనుభవాల సారం, జ్ఞాననిధి, మానవ చైతన్యానికి వెలుగునిచ్చే దీపస్తంభం. ఒక మంచి పుస్తకం వ్యక్తి ఆలోచనలను మార్చగలదు. ఆ మార్పు కుటుంబానికి, అక్కడి నుంచి సమాజానికి విస్తరిస్తుంది. చరిత్రలో జరిగిన ప్రతి పెద్ద మార్పు వెనుక పుస్తకాల ప్రభావం కనిపిస్తుంది. జాతీయోద్యమ కాలంలో గ్రంథాలయాలు ప్రజల్లో చైతన్యాన్ని రగిలించి స్వాతంత్ర్య సాధనకు దోహదపడ్డాయి. సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం వంటి విలువలను ప్రజల్లో నాటింది కూడా పుస్తకాలే.

పుస్తకాలు మనలో మానవత్వాన్ని పెంపొందిస్తాయి. అవి అజ్ఞానం, మూఢనమ్మకాలపై అవగాహన కలిగించి సరైన దిశలో నడిపిస్తాయి. చదివిన వ్యక్తి తన హక్కులతో పాటు బాధ్యతలను కూడా గ్రహిస్తాడు. సమాజ నిర్మాణంలో చురుకుగా పాల్గొంటాడు. పుస్తకం ఒక మౌన గురువు; అది మన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే శక్తిని కలిగి ఉంటుంది.

అయితే నేటి కాలంలో పఠనాసక్తి తగ్గిపోతుండటం ఆందోళనకరం. స్మార్ట్‌ఫోన్‌లు, డిజిటల్ వినోదం వల్ల యువత పుస్తకాల నుండి దూరమవుతోంది. దీని ప్రభావంగా ఏకాగ్రత లోపం, ఆలోచనా శక్తి తగ్గుదల వంటి సమస్యలు పెరుగుతున్నాయి. సాంకేతికత అవసరమైనదే అయినా, దానికి బానిస కాకుండా సమతుల్యతను పాటించాలి.

పుస్తక పఠనం ఒక అలవాటుగా మారాలి. చిన్ననాటి నుంచే పిల్లల్లో చదివే సంస్కృతిని పెంపొందించాలి. చదవడం ఒక బాధ్యతగా కాకుండా ఆనందంగా భావించేలా ప్రోత్సహించాలి. పాఠశాలలు, కుటుంబాలు, ప్రభుత్వాలు కలిసి గ్రంథాలయాలను బలోపేతం చేసి పఠనాన్ని ప్రోత్సహించాలి.

పుస్తకాలు మనకు జ్ఞాన ద్వారాలు తెరుస్తాయి, కొత్త లోకాలతో పరిచయం చేస్తాయి. అవి మనలో విమర్శనాత్మక ఆలోచన, విశ్లేషణా సామర్థ్యాన్ని పెంపొందిస్తాయి. పుస్తకం మనకు స్నేహితుడు, గురువు, మార్గదర్శి. అది మనల్ని నవ్విస్తుంది, ఆలోచింపజేస్తుంది, మార్పు దిశగా నడిపిస్తుంది.

సమాజంలో స్థిరమైన మార్పు రావాలంటే పుస్తకాల పాత్ర అనివార్యం. తాత్కాలిక విప్లవాలకంటే పుస్తకాలు తీసుకువచ్చే మార్పు శాశ్వతం. అందుకే "పుస్తకం చదవండి – సమాజాన్ని మార్చండి" అన్న సందేశాన్ని మనం ఆచరణలో పెట్టాలి. ఈ ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా పఠనాన్ని జీవిత భాగంగా మార్చుకొని, జ్ఞానంతో నిండిన సమాజ నిర్మాణానికి తోడ్పడుదాం.

నేటి పాఠకుడే–రేపటి నాయకుడు.



**ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా..**
**నాగరాజు పడిశాల, గ్రంథపాలకుడు, కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మిర్యాలగూడ.**

# బీమా సొమ్ము అందజేత



**నేటి సాక్షి, తిమ్మాపూర్:** శ్రీ సాయి పురుషుల పొదుపు సహకార సంఘం నుస్తులాపూర్ సంఘానికి చెందిన సభ్యుడు వంగాల రాజిరెడ్డి చనిపోగా, అతని భార్య లక్ష్మికి బుధవారం రూ. 1,53,221లను సమితి అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, సంఘ అధ్యక్షుడు కొంటు రవీందర్ పాలకవర్గ సమక్షంలో అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మాచర్ల ఎల్లయ్య, పాలకవర్గ సభ్యులు గుండోజు బాలరాజు, దేవసాని సంపత్, వంగాల శ్రీనివాస్ రెడ్డి, కెమ్మసారం శ్రీనివాస్, నల్ల వెంకటేశం, ఘనకుడు మావురపు అజయ్ పాల్గొన్నారు.

# ఈటెండర్ రద్దు

**చేనేత కార్మికుల విజయం బిఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్. రమణలి**



**నేటి సాక్షి, జగిత్యాల(పూరెళ్ల బాపు):** చేనేత కార్మికుల పొట్టకొట్టేలా ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన పిఎంయు ఈ –టెండర్ నోటిఫికేషన్ ను హైకోర్టు రద్దు చేయడం చేనేత కుటుంబాల విజయమని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్. రమణ బుధవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 17 వేలకు పైగా హ్యాండ్ లుమ్స్ ఉండగా, వాటిపై ఆధారపడి 40 వేల చేనేత కుటుంబాలు పని చేస్తున్నాయని, కానీ రాష్ట్ర ప్రభుత్వం బడా కాంట్రాక్టర్ల ఒత్తిడి మేరకు ప్రత్యేక జీవో ద్వారా ఈ – టెండర్ విధానం తెచ్చి చేనేత కార్మికుల పొట్ట కొట్టాలని చూసిందన్నారు. దీనిపై చేనేత కార్మికులు హైకోర్టును అశ్రయించగా న్యాయం జరిగిందన్నారు. గురుకుల విద్యా సంస్థలు, అన్ని ప్రభుత్వ శాఖలు, సంస్థలకు అవసరమయ్యే బెడ్ షీట్లు, కార్పెట్లు, టవల్స్ అన్నీ టెస్కో ద్వారానే తీసుకోవాలనే హైకోర్టు వెంటనే యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని ఎమ్మెల్సీ రమణ ప్రభుత్వాన్ని కోరారు. అలాగే వస్త్రాల కొనుగోళ్ళ కోసం ముందస్తు ప్రణాళికలు రూపొందించి, చేనేత కార్మికులకు పని కల్పించాలన్నారు. ఇందుకోసం అవసరమైన నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేయాలనీ ఎమ్మెల్సీ ఎల్. రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# బుక్ కీపర్లకు మొబైల్ ఫోన్ల పంపిణీ



**నేటి సాక్షి :** మంత్రాలయం నియోజకవర్గంలో గ్రామ స్థాయిలో డిజిటల్ సేవలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో టీడీపీ ఇంచార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి బుక్ కీపర్లకు 140 మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. స్థానికంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎన్. రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రభుత్వ పథకాల అమలు, లెక్కలు నిర్వహణ, ప్రజలకు సేవల అందజేతలో బుక్ కీపర్ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. వారికి ఆధునిక సాంకేతిక సదుపాయాలు కల్పించడం ద్వారా పనితీరును వేగవంతం చేసి, సేవల నాణ్యతను మెరుగుపరచడం సాధ్యమవుతుందని తెలిపారు. డిజిటల్ విధానాలను గ్రామ స్థాయికి తీసుకెళ్లడం ద్వారా పరిపాలనలో పారదర్శకత పెరుగుతుందని, ప్రజలకు తక్షణ సేవలు అందించేందుకు ఇది దోహదపడుతుందని ఆయన అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తూ ప్రతి విభాగంలో సాంకేతికత వినియోగాన్ని ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, బుక్ కీపర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెద్దకడబూరులో ధరిత్రి దినోత్సవం



**నేటి సాక్షి :**పెద్దకడబూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఉమా రాజేశ్వరమ్మ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచే విద్యార్థులు మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్రకృతిని కాపాడేందుకు కృషి చేయాలని సూచించారు. జనవిజ్ఞాన వేదిక నాయకుడు శంకరయ్య మాట్లాడుతూ, కార్బన్ ఉద్గారాల కారణంగా ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, దీనిని తగ్గించాలంటే విస్తృతంగా మొక్కల పెంపకం చేపట్టాలని తెలిపారు. చెట్ల పెంపకంతో ప్రకృతి సమతుల్యతను కాపాడవచ్చని, పర్యావరణాన్ని పునరుద్ధరించడానికి ఇది అత్యవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పాఠశాల పరిసరాల్లో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచేందుకు ఉపన్యాసాలు, చర్చలు నిర్వహించారు.

# రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి అహ్మద్



**నేటి సాక్షి, కొమరం భీం ఆసిఫాబాద్(ఎండి ముబీన్):** దేశ పౌరులందరికీ సమాన హక్కులు కల్పించిన భారత రాజ్యాంగాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి అహ్మద్ పేర్కొన్నారు. కెరమేరి మండలంలోని గోయగాం గ్రామంలో ఈ నెల 29న నిర్వహించనున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం మరియు రాష్ట్రీయ అశోక్ పూలే అంబేద్కర్ ఫెస్టివల్‌కు సంబంధించిన గోడ పత్రికలను బుధవారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యుత్తమమైనదని కొనియాడారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 29వ తేదీ బుధవారం సాయంత్రం గోయగాం గ్రామంలో నిర్వహించే రాష్ట్రీయ అశోక్ పూలే అంబేద్కర్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ అధ్యక్షుడు నగ్రారే తారు, ఉపాధ్యక్షుడు టీ దత్తు, ప్రధాన కార్యదర్శి ఎం శంకర్, కోశాధికారి టి ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులు సమయానికి డ్యూటీ లో ఉండాలి

- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన : ఎమ్మెల్యే బిఎల్ఆర్



**నేటి సాక్షి, మిర్యాలగూడ :** పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని బుధవారం స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు మరియు సిబ్బంది పనితీరును ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులను సందర్శించి, అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న చికిత్స, మందుల పంపిణీ మరియు ఆహారం పట్ల ఆరా తీశారు. అనంతరం వైద్యులు మరియు నర్సింగ్ సిబ్బంది సమయపాలన రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. వారి వెంట ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కుంభలూరు వంతెనపై సీపీఎం పట్టు



**ప్రభుత్వానికి వినతి**

**నేటి సాక్షి :** కౌతాళం మండలం కుంభలూరు సమీపంలోని తుంగభద్ర నదిపై రెండు రాష్ట్రాలను కలిపే వంతెన నిర్మించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకుడు కే. మల్లయ్య మాట్లాడుతూ, కుంభలూరు వద్ద వంతెన నిర్మాణం జరిగితే రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు సులభతరం అవుతాయని తెలిపారు. ప్రస్తుతం ప్రజలు ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వంతెన నిర్మాణంతో సమయం మరియు ఖర్చు తగ్గుతుందని పేర్కొన్నారు. అదే విధంగా, ఈ వంతెన నిర్మాణం వల్ల వ్యాపార కార్యకలాపాలు విస్తరించి, స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు

# వికారాబాద్ లోని హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారికి విజ్ఞప్తి

**వికారాబాద్ డిపో మేనేజర్ నమ్రత**



**నేటి సాక్షి వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా నుండి ఆర్టీసీ డ్రైవర్లు కండక్టర్లు సమ్మె చేస్తున్న కారణంగా సామాన్య జనాలకు ఇబ్బంది కలుగుతుంది వారి యొక్క అత్యవసరలను దృష్టిలో పెట్టుకొని గవర్నమెంట్ యొక్క సూచనల మేరకు కొన్ని బస్సులు నడిపినందుకు నిర్ణయించుకున్నారు దీనికోసం హెవీ లైసెన్స్ ఉండి ఆసక్తి గల డ్రైవర్లు టెన్త్,ఇంటర్, డిగ్రీ పాసైన అమ్మాయిలు. అబ్బాయిలు కండక్టర్ జాబు కోసం రేపు మార్నింగ్ 4 గంటలకి వికారాబాద్ డిపో దగ్గరికి వచ్చినట్టయితే డ్రైవర్ల కి టెస్ట్ చేసి డ్యూటీలోకి తీసుకోబడును. ప్రతి ఒక్క బస్సు కి ఒక పోలీస్ ప్రొటెక్షన్ ఇచ్చి పంపించబడుతుంది కండక్టర్ గా చేసిన వారికి 800 రూపాయలు డ్రైవర్గా చేసిన వారికి 1000 రూపాయలు ఇవ్వబడుతుంది కాబట్టి ఆసక్తిగలవారు రేపు మార్నింగ్ 4 గంటల వరకు వికారాబాద్ డిపో దగ్గరికి రావలసిందిగా విజ్ఞప్తి

# తేనెటి విందులో పాల్గొన్న మంత్రి అడ్లూరి

**నేటి సాక్షి, జగిత్యాల (గుండ ప్రశాంత్ గౌడ్):** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం ఇస్రాజ్ పల్లి గ్రామం లో కొనుగోలు కేంద్రం ఓపెనింగ్ అనంతరం గ్రామానికి సంబంధించిన కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరినీ కలుపుకొని మాజీ ఉపసర్పంచ్ కొండ వెంకటేష్ గౌడ్ వారి స్వగృహంలో తేనెటి విందు చేయడం జరిగింది తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఇస్రాజ్ పల్లి గ్రామ రైతులు మండల కాంగ్రెస్ పార్టీ సభ్యులందరు స్వాగతం పలకడం జరిగింది

